# DD9 వార్త

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 203 | హైదరాబాద్, మార్చి, శుక్రవారం 13, 2026 | పేజీలు : 08 | వెల : 3.00


వెంటుంటాం అనేవాళ్ళు
వెన్నుపోటు పొడుస్తున్నారు
తోడుంటాం అనేవాళ్ళు
తొక్కేస్తున్నారు
అందరూ మనముందర
నటించేవాళ్ళే
అవసరం ఉన్నంతవరకూ
వేడుకుంటారు
అవసరానికి వాడుకుంటారు
అవసరం తీరిపోయాక
ఆడుకుంటారు
ఇదే ఈ లోకం తీరు..!!

## స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం తిరస్కారం

సభలో అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం

ప్రతిపక్షం ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నిస్తోంది

ఎంపీలపై హోంమంత్రి అమిత్ షా ఆగ్రహం

సభ్యులందరికీ మాట్లాడే హక్కుందని వెల్లడి

సభను మార్కెట్‌లా నడపలేమని వ్యాఖ్యలు



07



## నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే
# హాలీవుడ్ వచ్చినట్లే

ముంబై తర్వాత దేశంలోనే అతి పెద్ద స్టూడియో

మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ప్రారంభించిన సీఎం

నెట్‌ఫ్లిక్స్‌తో నా కల నిజం కాబోతోంది సీఎం

హాలీవుడ్ స్థాయి వినోదమే తమ లక్ష్యమని వెల్లడి

కార్యక్రమానికి హాజరైన సినీ ప్రముఖులు

### ఫ్యూచర్ సిటీలో మెగా స్టూడియోకు సర్కార్ సిద్ధం


**హైదరాబాద్, (డిడి9 వార్త):** భాగ్యనగరం మరో అంతర్జాతీయ మైలురాయిని అధిగమించింది. ప్రపంచ వినోద రంగ దిగ్గజం 'నెట్‌ఫ్లిక్స్' తన సరికొత్త ఐలైన్ స్టూడియోను హైదరాబాద్‌లో అట్టహాసంగా ప్రారంభించింది. ముంబై తర్వాత దేశంలోనే రెండో అతిపెద్ద స్టూడియోగా అవతరించిన ఈ కేంద్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, హైదరాబాద్‌ను కేవలం టాలీవుడ్‌కే కాకుండా హాలీవుడ్ స్థాయి వినోదానికి వేదికగా మార్చడమే తమ లక్ష్యమని ప్రకటించారు.

**ఫ్యూచర్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ సామ్రాజ్యం.. సీఎం బంపర్ ఆఫర్!**

తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో నెట్‌ఫ్లిక్స్ తన కార్యకలాపాలను మరింత విస్తరించుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ..మిగతా 3లో

# ఇది ప్రారంభం మాత్రమే...
## గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

దేశానికి ఇంధన సంక్షోభం ముంచుకొస్తోందని రాహుల్ గాంధీ హెచ్చరిక



గ్యాస్, పెట్రోల్, ఎల్పీజీ సరఫరాలో తీవ్ర సమస్యలు తప్పవని ఆందోళన

ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానాలే ఈ పరిస్థితికి కారణమని విమర్శ

ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సూచన

ఈ అంశంపై మాట్లాడేందుకు లోక్‌సభలో అనుమతి నిరాకరించారని వెల్లడి

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, దేశ ఇంధన భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తప్పుడు విదేశాంగ విధానాల కారణంగా దేశం త్వరలో గ్యాస్, పెట్రోల్ వంటి ఇంధనాల విషయంలో తీవ్ర సవాళ్లు ఎదుర్కోబోతోందని హెచ్చరించారు. గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది... ఇది ప్రారంభం మాత్రమే అని అన్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే మేల్కొని, తగిన ఏర్పాట్లు చేయాలని గురువారం డిమాండ్ చేశారు.

పార్లమెంట్ వెలుపల విలేకరులతో మాట్లాడిన రాహుల్ గాంధీ, దేశంలో నెలకొన్న గ్యాస్, ఎల్పీజీ పరిస్థితిపై సభలో మాట్లాడేందుకు తాను ప్రయత్నించగా, తనకు అనుమతి ..మిగతా 2లో

# కవితకు
## సీబీఐ సమన్లు

హైదరాబాద్ నివాసానికి అధికారులు రాక

ఢిల్లీ లిక్కర్ కేసులో కీలక పరిణామం

మార్చి 16న విచారణకు రావాలని ఆదేశాలు

హైకోర్టులో సీబీఐ అప్పీలుతో కీలక మలుపు




**హైదరాబాద్, (డిడి9 వార్త):** ఢిల్లీ మద్యం పాలసీ కేసు వ్యవహారం మరోసారి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ సమన్లు జారీ చేయడంతో హైదరాబాద్‌లోని ఆమె నివాసం వద్ద రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. అధికారులు ..మిగతా 2లో

## ముంబై చేరిన భారత చమురు నౌక



యుద్ధం ఉద్రిక్తతల నడుమ కీలక పరిణామం

హర్మూజ్ జలసంధిని దాటిన భారత నౌక

భారత కెప్టెన్ సాహసంతో సురక్షితంగా గమ్యం

యుద్ధ ప్రభావంతో నిలిచిన రవాణా

దౌత్య చర్చలకు దక్కిన ఫలితం

పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో మరిన్ని నౌకలు

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):** మధ్యప్రాచ్యంలో పెరుగుతున్న యుద్ధ ఉద్రిక్తతల కారణంగా ప్రపంచ చమురు రవాణాకు అత్యంత ..మిగతా 2లో

## ఎల్పీజీ బుకింగ్‌పై కఠిన నిబంధనలు

గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధి

నగర ప్రాంతాల్లో 25 రోజుల నిబంధన కొనసాగింపు

కేంద్రం నిర్ణయంతో ఆందోళనలో జనం

దేశ వ్యాప్తంగా గ్యాస్ సరఫరాపై ఒత్తిడి

అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో చర్యలు

పెద్ద కుటుంబాలకు ఇబ్బందిగా ప్రభుత్వ నిర్ణయం

03



## ఫిరాయింపుల కేసుకు తెర

స్పీకర్ నిర్ణయమే తుది తీర్పు

సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు

త్వరలో తీర్పు కాపీలు అందజేత

10 మంది ఎమ్మెల్యేలకు ఊరట

**హైదరాబాద్, (డిడి9 వార్త):** తెలంగాణలో ఎమ్మెల్యేలు పార్టీ మారిన ఫిరాయింపుల కేసు మీద సుప్రీంకోర్టు విచారణ ముగిసింది. బీఆర్ఎస్ పార్టీ సమర్పించిన పిటిషన్లను సుప్రీంకోర్టు పరిశీలించినట్లు ధర్మాసనం ప్రకటించింది. సుప్రీంకోర్టులో స్పీకర్ తరఫున వాదించిన న్యాయవాది అభిషేక్ సింఘ్వీ స్పీకర్ ఇప్పటికే తీర్పు ఇచ్చినట్లు ..మిగతా 2లో



## సమస్యల పరిష్కారానికే
# ప్రగతి ప్రణాళిక

ప్రజాప్రతినిధులు బాధ్యతగా పని చేయాలి

స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సూచనలు

99 రోజుల ప్రజా పాలనలో భాగస్వామ్యం

వికారాబాద్ పట్టణంలో శిక్షణ సమావేశం

సర్పంచులకు స్పీకర్ కీలక సూచనలు

పథకాలు అందేలా చూడాలని ఆదేశాలు

అధికారులతో సమన్వయం చేసుకోవాలన్న స్పీకర్



**హైదరాబాద్, (డిడి9 వార్త):** ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడంలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కీలక పాత్ర పోషిస్తుందని రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవ్వాలంటే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. వికారాబాద్ పట్టణంలోని నర్సింగ్ ఫంక్షన్ హాల్‌లో 99 రోజుల ప్రజాపాలన ..మిగతా 3లో

'కర్మ రిటర్న్స్' అని కవిత చేసిన ట్వీట్
## మర్చిపోయావా?.. కేటీఆర్

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఓటమిపై కవిత చేసిన ట్వీట్‌ను గుర్తుచేసిన కాంగ్రెస్ ఎంపీ


### స్పీకర్ దళితుడు కాబట్టే బీఆర్ఎస్ విమర్శలు చేస్తోంది

**హైదరాబాద్, (డిడి9 వార్త):** బీఆర్ఎస్ నేత కేటీఆర్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించడం సరికాదని అన్నారు. ఒకసారి ఫామ్‌హౌజ్‌కు వెళ్లి కేసీఆర్‌ను ..మిగతా 2లో



# ఇది ప్రారంభం మాత్రమే... గ్యాస్ కొరతతో దేశం అల్లాడుతోంది

మొదటిపేజీ తరువాయి



౦లభించలేదని తెలిపారు. "సాధారణంగా సభలో మాట్లాడటానికి ఒక పద్ధతి ఉంటుంది. కానీ ఇప్పుడు కొత్త విధానం మొదలైనట్లుంది. నేను మాట్లాడాలనుకున్న అంశంపై ముందు మంత్రి నిర్ణయిస్తారు, ఆ తర్వాతే నేను మాట్లాడాలి. మళ్ళీ ఆ తర్వాత మంత్రి స్పందిస్తారు. ఈ కొత్త పద్ధతి ఆశ్చర్యంగా ఉంది" అంటూ ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ, "రాబోయే రోజుల్లో గ్యాస్, పెట్రోల్, అన్ని రకాల ఇంధనాలు పెద్ద సమస్యగా మారనున్నాయి. ఎందుకంటే మన ఇంధన భద్రత దెబ్బతింది. ప్రభుత్వ లోపభూయిష్ట విదేశాంగ విధానం ఈ సమస్యను సృష్టించింది. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రధాని మోదీ మేల్కొని సన్నాహాలు ప్రారంభించాలి. లేకపోతే కోట్లాది మంది ప్రజలు తీవ్రంగా ప్రభావితమవుతారు" అని స్పష్టం చేశారు.

ఈ సమస్య కేవలం ఇరాన్ వంటి దేశాలు ఇంధన సరఫరాను అనుమతిస్తాయా లేదా అనేదాని కంటే చాలా పెద్దదని రాహుల్ అన్నారు. "మనం ఒక అస్థిరమైన కాలంలోకి అడుగుపెడుతున్నాం. భవిష్యత్తులో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా మన ప్రజలు ఇబ్బంది పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది" అని తెలిపారు.

తాను చేస్తున్నది రాజకీయ విమర్శ కాదని, రాబోయే పెను ప్రమాదం గురించి కేవలం హెచ్చరిస్తున్నానని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. "ఇది రాజకీయ ప్రకటన కాదు. నా కళ్లకు ఓ పెద్ద సమస్య కనిపిస్తోంది. ప్రపంచం మారుతోంది, దాని నిర్మాణం కూడా మారుతోంది. కాబట్టి మనం కూడా మన ఆలోచనా ధోరణిని మార్చుకోవాలి. స్పష్టతతో పనిచేయకపోతే, మారుతున్న ప్రపంచంలో భారత్‌ను 'కేంద్రంగా' నిలపకపోతే సమస్యలు తప్పవు" అని ఆయన పేర్కొన్నారు.

# కవితకు సీబీఐ సమన్లు

మొదటిపేజీ తరువాయి

నేరుగా ఆమె నివాసానికి వెళ్లి నోటీసులు అందజేయడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీసింది. ఈ కేసులో ఇటీవల ఆమెకు కోర్టు నుంచి ఊరట లభించినప్పటికీ, దర్యాప్తు సంస్థ చేసిన అప్పీల్‌తో పరిస్థితి మళ్లీ కొత్త మలుపు తిరిగినట్లు కనిపిస్తోంది.

**నివాసానికి చేరుకున్న సీబీఐ అధికారులు**

సీబీఐ అధికారులు హైదరాబాద్‌లోని కవిత నివాసానికి చేరుకుని సమన్లు అందజేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసు విచారణలో భాగంగా ఆమె హాజరు కావాలని కోరుతూ ఈ నోటీసులు ఇచ్చినట్లు తెలుస్తోంది. అధికారులు నోటీసులు ఇవ్వడంతో ఆమె నివాసం వద్ద మీడియా, రాజకీయ కార్యకర్తల సందడి కనిపించింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు కారణమైంది.

**కోర్టు తీర్పు తర్వాత కొత్త పరిణామం**

ఈ కేసులో కొంతకాలం క్రితం ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు కవితకు ఊరటనిచ్చింది. ఆమెపై సీబీఐ మోపిన ఆరోపణలకు సరైన ఆధారాలు లేవని పేర్కొంటూ కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది.దాంతో ఈ కేసులో ఆమెకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లైంది. ఆ తీర్పు తర్వాత ఈ వ్యవహారం కొంతకాలం నిశ్శబ్దంగా ఉన్నప్పటికీ, ఇప్పుడు మళ్లీ దర్యాప్తు సంస్థ చర్యలతో కొత్త మలుపు తిరిగింది.

**హైకోర్టును ఆశ్రయించిన సీబీఐ**

రౌజ్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సీబీఐ అంగీకరించలేదు. కేసును ప్రాథమిక దశలోనే కొట్టివేయడం సరైనది కాదని భావించిన దర్యాప్తు సంస్థ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది.కోర్టు ఇచ్చిన ఉపశమనంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్పీల్ దాఖలు చేసింది. ఈ నేపథ్యంలో హైకోర్టు సూచనల మేరకు తదుపరి విచారణ కోసం నోటీసులు జారీ చేసినట్లు సమాచారం.

**విచారణకు హాజరు కావాలని సూచన**

సీబీఐ జారీ చేసిన నోటీసుల్లో కవితను విచారణకు హాజరు కావాలని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 16న ఢిల్లీ హైకోర్టులో జరిగే విచారణకు హాజరు కావాలని సూచించారు .ఈ సమన్లతో కేసు మళ్లీ చర్చలోకి రావడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది.

**ఇతర నిందితులకు కూడా నోటీసులు**

ఈ కేసులో కేవలం కవితకే కాకుండా మరికొంత మందికి కూడా సమన్లు జారీ అయ్యాయి. ఈ కేసులో నిందితులుగా పేర్కొన్న పలువురికి కూడా సీబీఐ అధికారులు నోటీసులు అందజేశారు.మాగుంట శ్రీనివాస రెడ్డి, ఆడిటర్ బుచ్చిబాబు, రామచంద్ర పిళ్లే, అభిషేక్ బోయిన్‌పల్లి తదితరులకు కూడా సమన్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. వీరంతా కూడా కోర్టు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

**మళ్లీ చర్చనీయాంశమైన కేసు**

ఢిల్లీ మద్యం పాలసీ కేసు గతంలో దేశవ్యాప్తంగా చర్చకు కారణమైంది. పలు రాజకీయ నాయకుల పేర్లు ఈ కేసులో వినిపించడంతో రాజకీయంగా కూడా పెద్ద చర్చ జరిగింది.అయితే కోర్టు తీర్పు తర్వాత ఈ కేసు కొంతకాలం ప్రశాంతంగా కనిపించింది. ఇప్పుడు మళ్లీ సీబీఐ చర్యలతో కేసు మరోసారి వార్తల్లో నిలిచింది.

**తెలంగాణ రాజకీయాల్లో చర్చ**

కవితకు సమన్లు జారీ కావడం తెలంగాణ రాజకీయాల్లో కూడా చర్చకు దారితీసింది. రాజకీయ పార్టీలు ఈ పరిణామాలను గమనిస్తున్నాయి.ఈ కేసు ముందుకు ఎలా సాగుతుందన్నదానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరిగింది.

**హైకోర్టు విచారణ కీలకం**

ఢిల్లీ హైకోర్టులో జరిగే విచారణ ఇప్పుడు కీలకంగా మారింది. సీబీఐ దాఖలు చేసిన అప్పీల్‌పై కోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నదానిపై అందరి దృష్టి ఉంది.కోర్టు తీర్పు ఆధారంగా కేసు దిశ మారే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**మళ్లీ విచారణ జరిగే అవకాశమా?**

హైకోర్టు సీబీఐ వాదనలను సమర్థిస్తే కేసు మళ్లీ విచారణ దశలోకి వెళ్లే అవకాశం ఉందని అంటున్నారు. అదే సమయంలో కోర్టు రౌజ్ అవెన్యూ కోర్టు తీర్పును సమర్థిస్తే కవితకు మరోసారి ఊరట లభించే అవకాశం ఉంటుంది.

**రాజకీయ ప్రభావం**

ఈ కేసు రాజకీయంగా కూడా ప్రభావం చూపే అవకాశముందని విశ్లేషకులు భావిస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణలో ఈ వ్యవహారం రాజకీయ చర్చలకు దారితీసే అవకాశముంది.

**తదుపరి పరిణామాలపై ఆసక్తి**

ప్రస్తుతం అందరి దృష్టి ఢిల్లీ హైకోర్టులో జరిగే విచారణపై నిలిచింది. కోర్టు నిర్ణయం ఆధారంగా కేసు ఎలా ముందుకు సాగుతుందో తేలనుంది.మొత్తానికి ఢిల్లీ మద్యం పాలసీ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారడంతో రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. రాబోయే రోజుల్లో ఈ వ్యవహారం మరిన్ని పరిణామాలకు దారితీసే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.




# ముంబై చేరిన భారత చమురు నౌక

మొదటిపేజీ తరువాయి

కీలకమైన హర్మ్యూజ్ జలసంధి తీవ్రంగా ప్రభావితమైంది. ఈ మార్గం ద్వారా జరిగే చమురు మరియు సహజ వాయువు రవాణా అంతరాయం కలగడంతో అనేక దేశాల్లో ఇంధన సరఫరాపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితుల్లోనే ఒక చమురు ట్యాంకర్ హర్మ్యూజ్ జలసంధిని దాటి సురక్షితంగా భారత్‌కు చేరుకోవడం విశేషంగా మారింది.లైబీరియా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ ముంబై పోర్టుకు చేరుకుంది. ఈ నౌకను భారతీయ కెప్టెన్ నడిపించడం మరో విశేషం. యుద్ధ పరిస్థితులు నెలకొన్న సమయంలో ప్రమాదకర మార్గాన్ని దాటి భారత్‌కు చేరిన తొలి నౌకగా ఇది గుర్తింపు పొందింది.

**యుద్ధ ప్రభావంతో నిలిచిన రవాణా**

అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై దాడులు ప్రారంభించిన తర్వాత మధ్యప్రాచ్య ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ వ్యూహాత్మకంగా కీలకమైన హర్మ్యూజ్ జలసంధిని తమ నియంత్రణలోకి తీసుకుంది. ఈ మార్గం ద్వారా వెళ్లే అనేక వాణిజ్య నౌకలకు ఇరాన్ పరిమితులు విధించింది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు సరఫరా గొలుసు దెబ్బతింది. కొన్ని దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.హర్మ్యూజ్ జలసంధి ప్రపంచ చమురు రవాణాలో అత్యంత కీలక మార్గం. ప్రపంచ వ్యాప్తంగా వినియోగించే ముడి చమురులో సుమారు ఐదవ వంతు ఈ మార్గం ద్వారానే రవాణా అవుతుంది. అందువల్ల ఈ మార్గం మూసివేయడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతోంది.

**సౌదీ నుంచి ముడి చమురు లోడ్**

ముంబై చేరుకున్న ఈ ట్యాంకర్ పేరు "షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్". ఈ నౌక సౌదీ అరేబియాలోని రాస్ తనురా ఓడరేవు వద్ద ముడి చమురును లోడ్ చేసుకుంది. మార్చి 1న అక్కడి నుంచి ప్రయాణానికి సిద్ధమైంది. సుమారు లక్షా ముప్పై ఐదు వేల మెట్రిక్ టన్నుల ముడి చమురును ఈ ట్యాంకర్ మోసుకొచ్చింది. ప్రపంచంలోని ప్రముఖ సముద్ర మార్గాల్లో ఒకటైన హర్మ్యూజ్ జలసంధిని దాటాల్సి రావడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది.

**జలసంధి దాటిన కీలక ఘట్టం**

మారిటైమ్ ట్రాకింగ్ డేటా ప్రకారం ఈ ట్యాంకర్ చివరిసారిగా మార్చి 8న హర్మ్యూజ్ జలసంధి ప్రాంతంలో కనిపించింది. ఆ తర్వాత కొంతసేపు దాని సిగ్నల్స్ కనిపించకుండా పోయాయి. నౌకలోని సిబ్బంది భద్రతా కారణాల వల్ల ఆటోమేటిక్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ మరియు ట్రాన్స్‌పాండర్‌లను తాత్కాలికంగా ఆఫ్ చేసినట్లు సమాచారం. ఈ విధానాన్ని సముద్ర రవాణాలో "గోయింగ్ డార్క్" అని అంటారు. ప్రమాదకర పరిస్థితుల్లో ప్రత్యర్థులకు నౌక స్థానాన్ని తెలియకుండా ఉండేందుకు కొన్నిసార్లు ఈ పద్ధతిని ఉపయోగిస్తారు.జలసంధిని విజయవంతంగా దాటిన తర్వాత నౌక మళ్లీ ట్రాకింగ్ సిస్టమ్‌లో కనిపించింది. అనంతరం భారత తీరానికి ప్రయాణం కొనసాగించింది.

**ముంబై పోర్టుకు చేరిన నౌక**

సంక్షోభ పరిస్థితుల్లో ప్రయాణం సాగించిన ఈ చమురు ట్యాంకర్ చివరకు ముంబై నౌకాశ్రయానికి చేరుకుంది. బుధవారం మధ్యాహ్నం సమయంలో అది పోర్టుకు చేరినట్లు అధికారులు తెలిపారు.యుద్ధ పరిస్థితుల మధ్య హర్మ్యూజ్ జలసంధిని దాటి భారత్‌కు చేరిన తొలి నౌకగా ఇది గుర్తింపు పొందింది. దీంతో దేశంలో చమురు సరఫరాపై ఉన్న ఆందోళనలు కొంతవరకు తగ్గినట్లు భావిస్తున్నారు.

**భారత కెప్టెన్ సాహసం**

ఈ నౌకను నడిపిన కెప్టెన్ సుక్షాంత్ సింగ్ సింధు భారతీయుడు. ప్రమాదకర పరిస్థితుల్లోనూ జలసంధిని దాటించి నౌకను సురక్షితంగా గమ్యస్థానానికి తీసుకువచ్చినందుకు ఆయనకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.నౌకలో మొత్తం 29 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో భారతీయులు, పాకిస్థాన్, ఫిలిప్పీన్స్‌కు చెందిన నావికులు కూడా ఉన్నారు.

**నౌక నిర్వహణ**

ఈ ట్యాంకర్ కార్యకలాపాలను గ్రీస్‌కు చెందిన డైనకామ్ ట్యాంకర్ మేనేజ్‌మెంట్ కంపెనీ నిర్వహిస్తోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో కీలకమైన ముడి చమురు రవాణాలో ఈ సంస్థకు అనుభవం ఉంది.

**దౌత్య చర్చల ఫలితం**

హర్మ్యూజ్ జలసంధిలో చిక్కుకున్న భారత నౌకల సమస్యపై భారత్ మరియు ఇరాన్ మధ్య దౌత్య చర్చలు జరిగాయి. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం .ఈ చర్చల అనంతరం భారత జెండాతో ప్రయాణించే నౌకలు జలసంధి గుండా వెళ్లేందుకు ఇరాన్ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అక్కడ ఉన్న కొన్ని నౌకలకు మార్గం సుగమమైంది.



**పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో భారత నౌకలు**

షిప్పింగ్ మంత్రిత్వశాఖ సమాచారం ప్రకారం ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో భారత జెండాతో ప్రయాణించే 28 నౌకలు ఉన్నాయి. వాటిలో 24 నౌకలు హర్మ్యూజ్ జలసంధికి పశ్చిమ భాగంలో ఉండగా, నాలుగు నౌకలు తూర్పు వైపు ఉన్నాయి. ఈ నౌకల్లో వందలాది భారతీయ నావికులు పనిచేస్తున్నారు.అక్కడి పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**ప్రపంచానికి కీలక మార్గం**

హర్మ్యూజ్ జలసంధి ప్రపంచ చమురు రవాణాకు అత్యంత ముఖ్యమైన మార్గం. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలోని సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఇరాక్, కతార్ వంటి దేశాల నుంచి ముడి చమురు ఈ మార్గం ద్వారానే ప్రపంచ మార్కెట్లకు చేరుతుంది.ఈ మార్గం మూసివేయడం వల్ల ప్రపంచ మార్కెట్లో చమురు ధరలు పెరిగే ప్రమాదం ఉంది.

**భారతానికి ఉన్న ప్రాధాన్యం**

భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు వినియోగ దేశం. దేశానికి అవసరమైన ముడి చమురులో పెద్ద భాగం దిగుమతుల ద్వారానే వస్తుంది.అందులో గల్ఫ్ దేశాల వాటా ఎక్కువగా ఉంటుంది. అందువల్ల హర్మ్యూజ్ జలసంధిలో ఏర్పడే అంతరాయం భారత్‌పై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంటుంది.

**ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ**

ఈ పరిస్థితుల్లో భారత్ ప్రత్యామ్నాయ చమురు సరఫరా మార్గాలను కూడా పరిశీలిస్తోంది. రష్యా నుంచి చమురు దిగుమతులను పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం.

**నౌకలపై దాడులు**

యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి హర్మ్యూజ్ జలసంధి పరిసర ప్రాంతాల్లో కొన్ని నౌకలపై దాడులు జరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇప్పటివరకు సుమారు 16 నౌకలు దాడులకు గురైనట్లు తెలుస్తోంది.కాండ్లా పోర్ట్‌కు వస్తున్న ఒక థాయ్ నౌకపై కూడా దాడి జరిగినట్లు సమాచారం. ఈ ఘటనను భారత్ తీవ్రంగా ఖండించింది.

**భద్రతపై కేంద్రీకృత దృష్టి**

భారత నౌకలు మరియు నావికుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. విదేశాంగ, రక్షణ, షిప్పింగ్ శాఖలు కలిసి పరిస్థితులను పరిశీలిస్తున్నాయి.అవసరమైతే భారత నౌకలకు రక్షణ చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**ఆశ కలిగించిన సంఘటన**

యుద్ధ ఉద్రిక్తతల మధ్య హర్మ్యూజ్ జలసంధిని దాటి ఒక చమురు నౌక సురక్షితంగా భారత్‌కు చేరుకోవడం కీలక పరిణామంగా భావిస్తున్నారు.ఇది భవిష్యత్‌లో చమురు రవాణాకు కొంత ఆశ కలిగించే పరిణామంగా విశ్లేషకులు భావిస్తున్నారు. అదే సమయంలో మధ్యప్రాచ్య పరిస్థితులు ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నందున ప్రపంచ దేశాలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు.

# ఫిరాయింపుల కేసుకు తెర

మొదటిపేజీ తరువాయి

కోర్టుకు తెలియజేశారు. ఈ వాదనను సుప్రీంకోర్టు గౌరవించింది. అయితే, తీర్పు కాపీలు బీఆర్‌ఎస్ తరఫుకు ఇంకా అందలేదు అని పిటిషనర్ లాయర్ తెలిపారు.

**తీర్పు కాపీలు త్వరలో అందజేయాలని ఆదేశం**

సుప్రీంకోర్టు స్పీకర్‌ను ఆదేశించి, రెండు రోజులలోగా పిటిషనర్లకు తీర్పు కాపీలు అందజేయాలని చెప్పింది. అలాగే, పిటిషనర్ అడిగే ఇతర ఆధారాలు, వివరాలు నాలుగు రోజుల లోపు అందజేయాలని కూడా చెప్పింది. సుప్రీంకోర్టు, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్పీకర్ తీర్పు ప్రకటించాక మాత్రమే ఈ ప్రక్రియలో జోక్యం చేసుకోవచ్చని అభిప్రాయపడింది.

**పార్టీ మారిన ఎమ్మెల్యేల వివరాలు**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్ సహా 10 మంది ఎమ్మెల్యేలు తర్వాత కాంగ్రెస్‌లో చేరారు. బీఆర్‌ఎస్ నేతలు 10 వ షెడ్యూల్ ప్రకారం ఈ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్ వద్ద పిటిషన్ ఇచ్చారు. కానీ స్పీకర్ తీర్పు ఆలస్యంగా వస్తోందని బీఆర్‌ఎస్ పిటిషన్లలో పేర్కొన్నారు.

**హైకోర్టు చెల్లింపు, సింగిల్ బెంచ్ ఆదేశాలు**

బీఆర్‌ఎస్ పిటిషన్లను మొదట తెలంగాణ హైకోర్టు సింగిల్ బెంచ్ పరిశీలించింది. అసెంబ్లీ సెక్రటరీకు నాలుగు వారాల్లో స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. అయితే సెక్రటరీ డివిజన్ బెంచ్‌లో సవాలు చేసారు. కోర్టు స్పీకర్ నిర్ణయం తీసుకోకపోవడం వల్ల జోక్యం చేసుకోవడం సరిగా లేదని పేర్కొంది. ఈ సింగిల్ బెంచ్ ఇచ్చిన నాలుగు వారాల గడువును రద్దు చేసింది. డివిజన్ బెంచ్ తీర్పును బీఆర్‌ఎస్ సుప్రీంకోర్టులో సవాలు చేసింది.

**స్పీకర్ తీర్పు, సుప్రీంకోర్టు ఏకీభవనం**

సుప్రీంకోర్టు నిర్ణయం ప్రకారం, మూడు నెలల లోపు ఫిరాయింపుల పిటిషన్లపై తీర్మానం చెప్పాలని స్పీకర్‌కు ఆదేశాలు ఇచ్చింది. మార్చి 11న, కోర్టు గడువు ముగియడానికి ఒక రోజు మునుపు, స్పీకర్ గడ్డ ప్రసాద్ నిర్ణయం ప్రకటించారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై చెల్లుబాటు అయ్యే ఆధారాలు లేవని పేర్కొన్నారు. అందువల్ల వారిని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలుగా పరిగణించి తీర్పు ఇచ్చారు.ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు విచారణలో స్పీకర్ ఇప్పటికే తీర్పు ఇచ్చారని అభిషేక్ సింఘ్వీ తెలిపారు. సుప్రీంకోర్టు ఈ తీర్పును ఏకీభవించింది. ఇప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ పిటిషనర్లు, స్పీకర్ తీర్పు కాపీలు అందక ముందే కోర్టు ఏకీభవించడం చర్చనీయాంశం అయింది.

బీఆర్‌ఎస్‌కి చెందిన 10 మంది ఎమ్మెల్యేల ఫిరాయింపు పిటిషన్లపై స్పీకర్ తీర్పు సప్తాదిలో నిర్ణయమవుతుందని సుప్రీంకోర్టు స్పష్టత ఇచ్చింది. ఇక ఈ కేసు సరిగా పార్లమెంట్ నియమాల ప్రకారం పరిష్కరించబడింది. అటువంటి చర్యల ద్వారా భవిష్యత్‌లో ఎమ్మెల్యేల ఫిరాయింపుల విషయంలో స్పష్టమైన మార్గదర్శకత ఏర్పడింది.ఈ కేసు తెలంగాణ రాజకీయాల్లో కొత్త ట్విస్టును సృష్టించినట్లుగా అంచనా వేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల స్థానాన్ని, స్పీకర్ తీర్పును సుప్రీంకోర్టు ఏకీభవించడం భవిష్యత్తులో రాజకీయ విధానాలపై ప్రభావం చూపనుంది.



# 'కర్మ రిటన్స్' అని కవిత చేసిన ట్వీట్ మర్చిపోయావా?.. కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

అడిగితే అసలు విషయం కేటీఆర్‌కు తెలుస్తుందని కౌంటర్ ఇచ్చారు. కొత్తగా వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో ఏకపాత్రాభినయం చేయాలని పార్టీ ఫిరాయింపులకు పాల్పడటం మొదలు పెట్టిందే కేసీఆర్ అని గుర్తుచేశారు. తెలంగాణలో ప్రతిపక్షాలు లేకుండా చేయాలని చూశారని అన్నారు. పార్టీ ఫిరాయింపులు ఏ స్థాయిలో చేయవచ్చో కేసీఆర్ నిరూపించారని తెలిపారు. అవసరం అయితే పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలకు మంత్రి పదవి ఎట్లా ఇవ్వవచ్చో కేసీఆర్ రుజువు చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు.

**అందుకే స్పీకర్‌ను టార్గెట్ చేశారు?**

స్పీకర్ దళితుడు కాబట్టే బీఆర్‌ఎస్ విమర్శలు చేస్తోంది. స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని బీఆర్‌ఎస్ తప్పుబడుతోంది. సైకిల్ గుర్తుపై గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మంత్రి పదవి, హస్తం గుర్తుపై గెలిచిన సబితా ఇంద్రారెడ్డికి మంత్రి పదవి ఇచ్చారు. ఇప్పుడు కేటీఆర్ నీతులు చెబుతుంటే.. దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. రాహుల్ గాంధీని తిట్టాలన్న అజెండాతో కేటీఆర్ మాట్లాడుతున్నారు. ప్రజలు నమ్మడం లేదు, ఓట్లు వేయడం లేదని కేటీఆర్ జిమ్‌కు వెళ్తున్నారు. స్పీకర్‌పై బీఆర్‌ఎస్ పార్టీకి అక్కసు ఎందుకు' అని చామల కిరణ్ ప్రశ్నించారు.

**అమిత్ షా ఒక స్టేట్మెంట్ - బండి సంజయ్ ఒక స్టేట్మెంట్..**

స్పీకర్ నిర్ణయంపై హైకోర్టుకు వెళ్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. స్పీకర్ అధికారాలపై కోర్టులు జోక్యం చేసుకోలేవని నిన్ననే లోక్‌సభలో అమిత్ షా మాట్లాడారు. స్పీకర్ అధికారాలపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఒక స్టేట్ మెంట్ సహాయ మంత్రి బండి సంజయ్ మరో స్టేట్ మెంట్ ఇస్తున్నారు. స్పీకర్ గురించి బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే మాట్లాడుతున్నాయి. బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటే అని పార్లమెంట్ ఎన్నికల్లో తేలిపోయింది. కాంగ్రెస్ పాలనను తప్పుదోవ పట్టించడానికి కేటీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాట్లాడుతున్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన అవినీతిని ఎందుకు బీజేపీ అడ్డుకోలేదు. కేటీఆర్ సొంత చెల్లి కర్మ రిటన్స్ అని ట్వీట్ చేశారు. బీజేపీ, బీఆర్‌ఎస్ ఇంటర్నల్ ఒప్పందం తెలంగాణ ప్రజలకు తెలుసు. కేటీఆర్ మాట్లాడితే గురివింద గింజ సిగ్గుపడుతుంది. బండి సంజయ్ మీ బాస్ అమిత్ షా గోవా, మహారాష్ట్ర, కర్ణాటకలో ఎలాంటి ఫిరాయింపులు చేశారో గుర్తు లేదా..? అని చామల కిరణ్ కుమార్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు.



## నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే
# హాలీవుడ్ వచ్చినట్లే

**మొదటిపేజీ తరువాయి**

పిలుపునిచ్చారు. ఇందుకోసం అవసరమైన ఎంత స్థలాన్నైనా కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన హామీ ఇచ్చారు. కేవలం ఒక స్టూడియోగానే కాకుండా, నెట్‌ఫ్లిక్స్ తన కార్పొరేట్ కార్యాలయాన్ని కూడా ముంబై నుంచి హైదరాబాద్‌కు తరలించాలని (రిలొకేట్) ఆయన కోరారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 'ఫార్చ్యూన్ 500' కంపెనీలకు హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా మారాలన్నది తమ ప్రభుత్వ సంకల్పమని సీఎం స్పష్టం చేశారు.

**టెక్నోకలర్ నుంచి ఐలైన్ వరకు.. సాంకేతిక విప్లవం**

వినోద రంగంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికత ఎలా పరిణామం చెందిందో సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. "ఒకప్పుడు బ్లాక్ అండ్ వైట్ సినిమాలతో మొదలైన ప్రయాణం.. టెక్నోకలర్, ఈస్ట్‌మన్ కలర్, 70 ఎంఎం, డాల్బీ సౌండ్ వరకు ఎదిగింది. ఇప్పుడు విజువల్ ఎఫెక్ట్స్ మరియు యానిమేషన్ ప్రపంచాన్ని ఏలుతున్నాయి" అని ఆయన అన్నారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో రాకతో యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ మరియు కామిక్స్ రంగాల్లో హైదరాబాద్ ఒక గ్లోబల్ హబ్‌గా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇకపై హాలీవుడ్ సినిమాలు కూడా హైదరాబాద్ మట్టి నుంచే ప్రాణం పోసుకోవాలని ఆయన తన మనసులో మాటను బయటపెట్టారు.

**3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం**

తెలంగాణను ఆర్థికంగా అగ్రస్థానంలో నిలబెట్టేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ముఖ్యమంత్రి తెలిపారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇందులో వినోదం మరియు సాంకేతిక రంగాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు వచ్చే ప్రతి పెట్టుబడికి, ప్రతి సంస్థకు ప్రభుత్వం నుంచి పూర్తి రక్షణ మరియు సహకారం ఉంటుందని ఆయన పెట్టుబడిదారులకు భరోసా ఇచ్చారు. "నెట్‌ఫ్లిక్స్ ప్రపంచానికి వినోదాన్ని అందిస్తే, మేము ప్రపంచాన్ని సుసంపన్నం చేయాలని చూస్తున్నాం. మన ఇద్దరి లక్ష్యం ఒకటే" అంటూ ఆయన నెట్‌ఫ్లిక్స్ ప్రతినిధులతో వ్యాఖ్యానించారు.

**సంస్కృతుల వారధి.. హైదరాబాద్ - నెట్‌ఫ్లిక్స్ బంధం**

నెట్‌ఫ్లిక్స్ మరియు హైదరాబాద్ నగరం మధ్య ఉన్న సారూప్యతలను సీఎం రేవంత్ రెడ్డి ఎంతో చాకచక్యంగా వివరించారు. నెట్‌ఫ్లిక్స్ ఎలాగైతే ప్రపంచవ్యాప్తంగా ఉన్న విభిన్న సంస్కృతులను తన ప్లాట్‌ఫామ్ ద్వారా ఒకే చోటుకు చేరుస్తుందో, హైదరాబాద్ కూడా అదే విధంగా అన్ని ప్రాంతాల ప్రజలను, సంస్కృతులను తనలో కలుపుకుంటుందని అన్నారు. ఫుడ్, ట్రావెల్, వారసత్వ కట్టడాల విషయంలో నెట్‌ఫ్లిక్స్ వీక్షకులు మరియు హైదరాబాద్ సందర్శకులు ఒకే విధమైన అనుభూతిని పొందుతారని ఆయన అభిప్రాయపడ్డారు. తెలంగాణ సంస్కృతిని, ప్రతిభను ప్రపంచవ్యాప్తం చేయడంలో ఈ ఐలైన్ ఫెసిలిటీ ఒక గేట్‌వేలా పనిచేస్తుందని సీఎం తెలిపారు.

**క్రీడారంగంపై నెట్‌ఫ్లిక్స్ చూపు.. తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీ**

నెట్‌ఫ్లిక్స్ కేవలం సినిమాలు, సిరీస్‌లకే పరిమితం కాకుండా, ఈ మధ్య కాలంలో క్రీడల (Sports) ప్రత్యక్ష ప్రసారాలపై కూడా దృష్టి సారించడాన్ని సీఎం రేవంత్ రెడ్డి అభినందించారు. భవిష్యత్తులో నెట్‌ఫ్లిక్స్ అతిపెద్ద స్పోర్ట్స్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీగా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, తెలంగాణ ప్రభుత్వం కూడా క్రీడలకు పెద్దపీట వేస్తోందని, రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని ఆయన గుర్తు చేశారు. క్రీడా రంగంలో కూడా నెట్‌ఫ్లిక్స్, తెలంగాణ ప్రభుత్వం కలిసి పనిచేస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని ఆయన పిలుపునిచ్చారు.

**సినీ ప్రముఖుల సందడి.. భవిష్యత్తుపై బలమైన ముద్ర**

ఈ ప్రారంభోత్సవ వేడుకలో ఐలైన్ స్టూడియో సీఈఓ జెఫ్ షపిరో, కేంద్ర సమాచార ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు వంటి ప్రముఖులు పాల్గొన్నారు. వీరితో పాటు టాలీవుడ్ ప్రముఖ నటుడు, నిర్మాత రాణా దగ్గుబాటి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు మరియు నెట్‌ఫ్లిక్స్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఒకప్పుడు డీవీడీలను అద్దెకు ఇచ్చే చిన్న సంస్థగా మొదలై, నేడు ఓటీటీ ప్రపంచంలో రారాజుగా ఎదిగిన నెట్‌ఫ్లిక్స్ ప్రయాణం స్ఫూర్తిదాయకమని రేవంత్ రెడ్డి కొనియాడారు. "మనమంతా కలిసి భవిష్యత్తుపై బలమైన ముద్ర వేద్దాం.. తెలంగాణ నుంచి ప్రపంచ స్థాయి వినోదాన్ని అందిద్దాం" అని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియో ప్రారంభం కేవలం ఒక భవనం ప్రారంభోత్సవం కాదు.. ఇది తెలంగాణ ఐటీ మరియు వినోద రంగాల చరిత్రలో ఒక నూతన అధ్యాయం. రాబోయే రోజుల్లో భారత్ ఫ్యూచర్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ విస్తరణ జరిగితే, వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు హైదరాబాద్ పేరు అంతర్జాతీయ పటంలో మరింత ప్రకాశించనుంది.




# సమస్యల పరిష్కారానికే ప్రగతి ప్రణాళిక

**మొదటిపేజీ తరువాయి**

ప్రగతి ప్రణాళిక అమలుకు సంబంధించిన శిక్షణా సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇటీవల గ్రామ పంచాయతీ మరియు మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులను అభినందించారు.

**స్థానిక స్థాయి నుంచే రాజకీయ ప్రస్థానం**

ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో, దేశంలో ఉన్న ప్రముఖ నాయకుల్లో చాలామంది తమ రాజకీయ జీవితాన్ని స్థానిక సంస్థల నుంచే ప్రారంభించారని చెప్పారు. గ్రామ సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు వంటి పదవుల ద్వారా ప్రజలతో నేరుగా మమేకమవుతూ అనుభవాన్ని సంపాదించవచ్చని తెలిపారు.తాను కూడా రాజకీయ జీవితాన్ని స్థానిక సంస్థల నుంచే ప్రారంభించానని ఆయన గుర్తు చేశారు. ఎంపీటీసీగా ప్రారంభమైన తన ప్రయాణం తరువాత ఎంపీపీగా, ఆపై శాసనసభ్యుడిగా, మంత్రిగా ఎదిగిందని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా సేవలందిస్తున్నానని తెలిపారు. కింది స్థాయి నుంచి ఎదిగిన ప్రజాప్రతినిధులకు ప్రజల సమస్యలపై మరింత అవగాహన ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ప్రజలకు సేవ చేయడం బాధ్యత**

ప్రజల నమ్మకంతో ఎన్నికైన ప్రతి ప్రజాప్రతినిధి ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని స్పీకర్ సూచించారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాల్సిన బాధ్యత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులపై ఉందన్నారు.ప్రస్తుతం ఎన్నికైన సర్పంచులు, చైర్మన్లు, కౌన్సిలర్లు చాలా మంది కొత్తవారే కావడంతో వారికి విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను బాగా అర్థం చేసుకుని గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయగలరని చెప్పారు.

**అధికారులు – ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలి**

ప్రభుత్వ యంత్రాంగంలో ప్రజాప్రతినిధులు, అధికారులు రెండు కళ్లలాంటివారని స్పీకర్ అన్నారు. అలాగే బండికి రెండు చక్రాల్లా ఇద్దరూ కలిసి పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని వివరించారు.ప్రభుత్వం రూపొందించిన పథకాలు సమర్థవంతంగా అమలవ్వాలంటే అధికారులు మరియు ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో పనిచేయాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలు త్వరగా అందించేందుకు సమన్వయం అవసరమని తెలిపారు.

**రాష్ట్రంలో అభివృద్ధి – సంక్షేమం**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాకేంద్రిత పాలన కొనసాగుతోందని స్పీకర్ పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు గ్రామాలు, పట్టణాల స్థాయిలో అమలవుతున్నాయని చెప్పారు.ప్రస్తుతం పదవిలో ఉన్న స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల ద్వారా ఈ కార్యక్రమాలు ప్రజలకు చేరుతున్నాయని తెలిపారు. ఈ పనులను సమర్థవంతంగా నిర్వహిస్తే ప్రజల్లో మంచి పేరు వస్తుందని ఆయన అన్నారు.

**సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని స్పీకర్ సూచించారు. ముఖ్యంగా మహిళల కోసం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీపై గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా చూడాలని చెప్పారు.అలాగే సన్న బియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్ల పథకం, కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్, డ్వాక్రా మహిళలకు వడ్డీ రహిత రుణాలు వంటి పథకాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు.

**ప్రజలకు స్పష్టంగా వివరించాలి**

ప్రజలు ప్రభుత్వంపై అనేక ప్రశ్నలు అడుగుతుంటారని స్పీకర్ అన్నారు. తులం బంగారం, మహిళలకు ఆర్థిక సహాయం, పెన్షన్ పెంపు వంటి అంశాలపై ప్రజలు ప్రశ్నిస్తారని చెప్పారు.ఈ విషయాలపై ప్రజలకు స్పష్టమైన సమాచారం ఇవ్వాలని సూచించారు. గత ప్రభుత్వ కాలంలో రాష్ట్రంపై భారీ అప్పులు మిగిలాయని, ప్రస్తుతం ప్రభుత్వం ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటోందని ప్రజలకు వివరించాలని తెలిపారు.

**ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయి**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు క్రమంగా మెరుగుపడుతున్నాయని స్పీకర్ అన్నారు. నెలకు వేల కోట్ల రూపాయల వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని చెప్పారు.ఆర్థిక పరిస్థితులు పూర్తిగా స్థిరపడిన తర్వాత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.

**ప్రజాప్రతినిధులుగా అవకాశం అరుదు**

ప్రజల మధ్య నుంచి వేల మందిలో ఒక్కరికి మాత్రమే ప్రజాప్రతినిధిగా ఎన్నికయ్యే అవకాశం వస్తుందని స్పీకర్ తెలిపారు. అలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రజలకు సేవ చేయాలని సూచించారు.గ్రామాలు, పట్టణాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు నిబద్ధతతో పనిచేస్తే ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించవచ్చని చెప్పారు.

**ఎన్నికల తర్వాత రాజకీయాలు పక్కన పెట్టాలి**

ఎన్నికల సమయంలో రాజకీయ పోటీ సహజమేనని స్పీకర్ అన్నారు. అయితే ఎన్నికలు ముగిసిన తర్వాత అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. గ్రామాలు, వార్డుల అభివృద్ధి కోసం రాజకీయ భేదాలు పక్కన పెట్టి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

**జిల్లా అభివృద్ధిపై దృష్టి**

వికారాబాద్ జిల్లాకు ముఖ్యమంత్రి మరియు స్పీకర్ వంటి కీలక పదవుల్లో నాయకత్వం ఉండటం జిల్లాకు గౌరవకరమైన విషయమని ఆయన అన్నారు. జిల్లాకు అవసరమైన నిధులు తెచ్చే బాధ్యత తమపై ఉందని తెలిపారు.అయితే ఆ నిధులను సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడం స్థానిక ప్రజాప్రతినిధుల బాధ్యత అని స్పష్టం చేశారు.

**కలెక్టర్ సూచనలు**

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి కూడా మాట్లాడారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధుల సహకారం చాలా అవసరమని ఆయన అన్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. గ్రామ సభల్లో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే వాటిని త్వరగా పరిష్కరించే అవకాశం ఉంటుందని చెప్పారు.

**ఎమ్మెల్యే సూచనలు**

తాండూర్ ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ఎన్నికకావడం ఒక బాధ్యతతో కూడిన అవకాశమని అన్నారు. ప్రజలకు సేవ చేయడం గొప్ప విషయం అని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కోరారు.



**పారిశుధ్యంపై అవగాహన**

గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యం మెరుగుపడేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే సూచించారు. శుభ్రమైన వాతావరణం ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుందని చెప్పారు.

**అధికారుల జవాబుదారీతనం అవసరం**

ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం చురుకుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

**సమావేశంలో పాల్గొన్న అధికారులు**

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహమేహర, అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, జిల్లా పరిషత్ సీఈవో సుధీర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్‌లు గడ్డం అనన్య, పట్లోళ్ల నీరజ, రజితతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు కూడా హాజరయ్యారు.

**ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి**

గ్రామాలు, పట్టణాల అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తేనే ప్రజలకు నిజమైన ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి తగిన చర్యలు తీసుకుంటేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని సమావేశంలో అభిప్రాయపడారు.

# ఎల్పీజీ బుకింగ్‌పై కఠిన నిబంధనలు

- గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధి
- నగర ప్రాంతాల్లో 25 రోజుల నిబంధన కొనసాగింపు
- కేంద్రం నిర్ణయంతో ఆందోళనలో జనం
- దేశ వ్యాప్తంగా గ్యాస్ సరఫరాపై ఒత్తిడి
- అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావంతో చర్యలు
- పెద్ద కుటుంబాలకు ఇబ్బందిగా ప్రభుత్వ నిర్ణయం

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

దేశవ్యాప్తంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరాపై పెరుగుతున్న ఒత్తిడిని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం బుకింగ్ నిబంధనలను కఠినతరం చేసే నిర్ణయం తీసుకుంది. గ్యాస్ సిలిండర్ల వినియోగాన్ని నియంత్రించడంతో పాటు అందరికీ సరఫరా అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా రెండు గ్యాస్ సిలిండర్ల బుకింగ్‌ల మధ్య ఉండే కనీస సమయాన్ని గ్రామీణ ప్రాంతాల్లో భారీగా పెంచుతూ కొత్త మార్గదర్శకాలను ప్రకటించారు.ఇప్పటివరకు ఒక సిలిండర్ బుకింగ్ చేసిన తర్వాత మరొక సిలిండర్ బుక్ చేసుకునేందుకు కనీసం 21 రోజుల గడువు ఉండేది. తర్వాత ఈ గడువును కేంద్ర ప్రభుత్వం 25 రోజులకు పెంచింది. ఇప్పుడు తాజా నిర్ణయంతో గ్రామీణ ప్రాంతాల్లో ఈ గడువును మరింత పెంచి 45 రోజులకు చేర్చుతున్నట్లు సమాచారం. అయితే పట్టణాలు, నగర ప్రాంతాల్లో మాత్రం ప్రస్తుతం అమలులో ఉన్న 25 రోజుల నిబంధనే కొనసాగనుంది.

**గ్రామీణ ప్రాంతాలపై ప్రభావం**

కొత్త నిర్ణయం అమల్లోకి వస్తే పల్లెటూర్లలో గ్యాస్ వినియోగించే కుటుంబాలపై దీని ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. ఒక సిలిండర్ తీసుకున్న తర్వాత రెండో సిలిండర్ కోసం కనీసం నెలన్నర రోజుల పాటు వేచి చూడాల్సి ఉంటుంది. ప్రస్తుతం అనేక గ్రామీణ కుటుంబాలు వంట కోసం పూర్తిగా ఎల్పీజీపై ఆధారపడుతున్నాయి. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల ద్వారా గ్యాస్ కనెక్షన్లు పొందిన కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బుకింగ్ గడువు పెరగడం ప్రజల్లో ఆందోళనకు కారణమవుతోంది.

**ప్రభుత్వ వాదన**

గ్యాస్ సరఫరాపై ఒత్తిడి పెరగడంతో అందరికీ సమానంగా సరఫరా అందించేందుకు ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఉన్న గ్యాస్ నిల్వలను సమర్థంగా వినియోగించేందుకు వినియోగ నియంత్రణ అవసరమని అధికారులు పేర్కొంటున్నారు. పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో గ్యాస్ డెలివరీ వ్యవస్థ కొంత నెమ్మదిగా ఉండటం కూడా ఒక కారణంగా భావిస్తున్నారు. దూర ప్రాంతాలకు సిలిండర్ల రవాణా ఖర్చులు పెరగడం, సరఫరా శృంఖలపై ఒత్తిడి పెరగడం వల్ల ప్రభుత్వం కొత్త విధానాన్ని అమలు చేస్తున్నట్లు సమాచారం.

**అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం**

ప్రపంచవ్యాప్తంగా ఏర్పడుతున్న రాజకీయ, సైనిక ఉద్రిక్తతలు కూడా ఇంధన సరఫరాపై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా చమురు మరియు గ్యాస్ రవాణా మార్గాల్లో అంతరాయం ఏర్పడింది.ఎర్ర సముద్రం మరియు హార్మూజ్ జలసంధి వంటి కీలక సముద్ర మార్గాల్లో నౌకల రాకపోకలు మందగించడంతో గ్యాస్ దిగుమతులు ప్రభావితమయ్యాయి. ఈ పరిస్థితి దేశీయ మార్కెట్‌పై కూడా ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు.

**సరఫరా సర్దుబాటు చర్యలు**

గ్యాస్ సరఫరా కొంతకాలం పాటు తగ్గే అవకాశం ఉన్నందున వినియోగాన్ని నియంత్రించడం ద్వారా పరిస్థితిని సమతుల్యం చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. సరఫరా సాధారణ స్థితికి వచ్చే వరకు ఈ 45 రోజుల నిబంధన అమల్లో ఉండే అవకాశముందని అధికారులు పేర్కొంటున్నారు.ఇది తాత్కాలిక చర్య మాత్రమేనని, పరిస్థితులు మెరుగుపడితే మళ్లీ పాత విధానాన్ని పునరుద్ధరించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

**పెద్ద కుటుంబాలకు ఇబ్బందులు**

కొత్త నిబంధన ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పెద్ద కుటుంబాలకు సమస్యలను తెచ్చిపెట్టే అవకాశం ఉంది. సాధారణంగా ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్న కుటుంబాల్లో ఒక గ్యాస్ సిలిండర్ గరిష్ఠంగా 20 నుంచి 25 రోజులు మాత్రమే సరిపోతుంది. అలాంటి పరిస్థితుల్లో మిగిలిన రోజుల్లో వంట ఎలా చేయాలనే ప్రశ్న తలెత్తుతోంది. చాలా కుటుంబాలు ప్రత్యామ్నాయ మార్గాల కోసం ఆలోచించాల్సి వస్తోంది.



**కట్టెల పొయ్యిల వైపు తిరుగు?**

గ్యాస్ అందుబాటులో లేకపోతే పల్లెల్లో ప్రజలు మళ్లీ కట్టెల పొయ్యిలను ఉపయోగించే పరిస్థితి రావచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. గతంలో చాలా కుటుంబాలు సంప్రదాయ వంట విధానాలనే ఉపయోగించేవి.కానీ ప్రభుత్వ పథకాల ద్వారా గ్యాస్ వినియోగం పెరగడంతో కట్టెల వినియోగం తగ్గింది. ఇప్పుడు గ్యాస్ కొరత ఏర్పడితే పాత విధానాలకు తిరిగి వెళ్లే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు.

**ఆరోగ్య సమస్యలపై ఆందోళన**

కట్టెల పొయ్యిల వినియోగం పెరిగితే మహిళల ఆరోగ్యంపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పొయ్యి పొగ కారణంగా శ్వాసకోశ సమస్యలు, కంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది.గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎక్కువసేపు వంటగదిలో ఉండాల్సి వస్తుండటంతో ఈ సమస్యలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది.

**బ్లాక్ మార్కెట్ ఆరోపణలు**

గ్యాస్ కొరత ఉన్న సమయంలో కొందరు అక్రమంగా సిలిండర్లను నిల్వ చేసి అధిక ధరలకు విక్రయిస్తున్నారని కూడా ఆరోపణలు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలు పెరిగినట్లు వినియోగదారులు చెబుతున్నారు. సాధారణ ధర కంటే ఎక్కువకు సిలిండర్లు అమ్ముతున్నారని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ఎక్కువ డబ్బు చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తోందని అంటున్నారు.

**పేదలపై ప్రభావం**

పేద కుటుంబాలపై ఈ పరిస్థితి మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఉచిత గ్యాస్ కనెక్షన్లు పొందిన అనేక కుటుంబాలు ఇప్పుడు సిలిండర్ దొరక్క ఇబ్బందులు పడుతున్నాయని తెలుస్తోంది. కొంతమంది మళ్లీ కట్టెలు, బొగ్గు వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను ఉపయోగించాల్సి వస్తోందని చెబుతున్నారు.

**గ్రామీణ ప్రజల ఆందోళన**

గ్రామీణ ప్రాంతాల్లో కొత్త నిబంధనపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. పట్టణాల్లో 25 రోజుల గడువు కొనసాగుతుండగా, పల్లెల్లో మాత్రం 45 రోజులు వేచి చూడాల్సి రావడం వివక్షగా భావిస్తున్నారని ప్రజలు అంటున్నారు. సమాన నిబంధనలు అమలు చేయాలని కొందరు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని కూడా కోరుతున్నారు.

**ప్రభుత్వానికి సవాల్**

గ్యాస్ సరఫరా మరియు వినియోగ నియంత్రణ మధ్య సమతుల్యం సాధించడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఒకవైపు సరఫరా పరిమితులు ఉండగా, మరోవైపు ప్రజల అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ఉంది. అందువల్ల సరఫరా వ్యవస్థను మెరుగుపరచడం, దిగుమతులను పెంచడం వంటి చర్యలు కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

**పరిస్థితులపై పర్యవేక్షణ**

ప్రస్తుతం దేశవ్యాప్తంగా గ్యాస్ సరఫరా పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం సమీక్షిస్తోంది. అవసరమైతే మరిన్ని చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రజలు గ్యాస్‌ను జాగ్రత్తగా వినియోగించాలని, అనవసర వినియోగాన్ని తగ్గించాలని కూడా సూచిస్తున్నారు.

**ముందున్న పరిస్థితి**

అంతర్జాతీయ పరిస్థితులు ఎలా మారుతాయన్నదే గ్యాస్ సరఫరాపై ప్రభావం చూపనుంది. మధ్య ప్రాచ్య ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గితే సరఫరా వ్యవస్థ మళ్లీ సాధారణ స్థితికి వచ్చే అవకాశం ఉంది.అప్పటివరకు వినియోగ నియంత్రణ వంటి చర్యలు కొనసాగవచ్చని భావిస్తున్నారు. అయితే గ్రామీణ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సమతుల్య నిర్ణయాలు తీసుకోవాలని అనేక వర్గాలు కోరుతున్నాయి.

## క్షతగాత్రులను పరామర్శించిన గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- ధైర్యంగా ఉండండి అండగా ఉంటాం
- మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు ఆదేశం

**ఆదిలాబాద్ జిల్లా, మార్చ్ 12 (డి డి 9):**

సిరికొండ మండలంలోని సోంపల్లి గ్రామస్తులకు నిర్మల్ జిల్లా కొండాపూర్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గాయపడిన సందర్భంగా ఇద్దరు మృతి చెందగా మిగితా 21 మందికి తీవ్ర గాయాలవగా వారిని ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఇట్టి విషయం తెలుసుకున్న గౌరవ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గారు తక్షణమే రిమ్స్ ఆసుపత్రికి చేరుకొని వారిని పరామర్శించారు. నాణ్యమైన వైద్యం అందించాలని రిమ్స్ డైరెక్టర్ జేసింగ్ రాథోడ్ గారిని ఆదేశించారు. ఎవరు అధైర్య పడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. వీరి వెంట ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బాధిత కుటుంబాలను ఆదుకుంటాం





- **జిల్లా ఇంచార్జి మంత్రి గారితో మాట్లాడి అందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేయిస్తా: ఆడే గజేందర్**
- **స్థానిక ఎంపీడీవో, రెవెన్యూ అధికారులతో కలిసి సంఘటన వివరాలు తెలుసుకున్న ఆడే గజేందర్**

**ఆదిలాబాద్ నేరడిగొండ మార్చ్ 12 (డి డి 9):**

నేరడిగొండ మండలంలోని బోరిగం గ్రామంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు ఇళ్లు మరియు రెండు కొట్టలు పూర్తిగా కాలిపోవడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. విషయం తెలుసుకున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ . వెంటనే గ్రామానికి చేరుకుని స్థానిక సర్పంచ్ వినేష్ తో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు ఈ సందర్భంగా ఆడే గజేందర్ .బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం కింద నిత్యవసర సరుకులు పంపుతానని తెలిపారు. మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. బాధితుల పరిస్థితిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి వారికి తక్షణ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే ఇల్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా కొత్త ఇళ్లు మంజూరు చేయించేందుకు జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు గారితో మాట్లాడి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు గ్రామస్థులు కూడా బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయం అందించాలని ఆడే గజేందర్ , కోరారు గ్రామ సర్పంచ్ రాథోడ్ వినీష్, పవర్ మున్నా మహారాజ్, రాథోడ్ , నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, యండి సద్దాం, జాదవ్ పవన్,రాథోడ్ సందీప్,రాథోడ్ గులాబ్ సింగ్, రాథోడ్ సాయి గ్రామస్తులు ఉన్నారు



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సర్పంచ్‌లు, కౌన్సిలర్లకు శిక్షణ కార్యక్రమం





**కామారెడ్డి, మార్చి 12(డిడి9 వార్త):**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, కౌన్సిలర్లకు అవగాహన కల్పించేందుకు గురువారం కళాభారతి వేదికగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మోహమ్మద్ షబ్బీర్ అలీ జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ముఖ్య అతిథులుగా హాజరై దిశా నిర్దేశం చేశారు.మార్చి 06, 2026 నుంచి జూన్ 12, 2026 వరకు అమలు చేయనున్న 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై నూతన ప్రజాప్రతినిధులకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం "జయ జయ హే తెలంగాణ" గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వం రూపొందించిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో స్థానిక ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని తెలిపారు. గ్రామ పంచాయతీలను మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దేలా 10 థీమ్‌లపై పూర్తి అవగాహన కలిగి పని చేయాలని సూచించారు.గ్రామాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పచ్చదనం పెంపు, పారిశుధ్యం, తాగునీటి సదుపాయం, విద్యా మరియు ఆరోగ్య సేవల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా ఉండాలని, పనులను పారదర్శకంగా అమలు చేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని సర్పంచ్‌లు, కౌన్సిలర్లకు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడంతో పాటు గ్రామాలు, పట్టణాల సమగ్ర అభివృద్ధి కోసం "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కింద 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు సమర్థవంతంగా చేరాలంటే గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.ఈ ప్రణాళికలో భాగంగా తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థలు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. గ్రామాల పరిశుభ్రత, తాగునీటి సరఫరా, ఉపాధి హామీ పథకం, వనమహోత్సవం, విద్యా కార్యక్రమాలు, ఆరోగ్య సేవలు, అంగన్‌వాడీ సేవలు, పంటల వైవిధ్యీకరణ, పర్యావరణ పరిరక్షణ, ఇందిరమ్మ ఇళ్ల పథకం తదితర అంశాలపై విస్తృతంగా వివరించారు. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో ప్రాణరక్షణకు సంబంధించిన CPR ప్రదర్శనను వైద్య సిబ్బంది నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం నివారణపై కూడా ప్రత్యేక అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, ఏఎస్పీ చైతన్యతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.











## వెదురు, దర్జీ, ఎంబ్రాయిడారి తదితర పనులపై శిక్షణ, ధ్రువీకరణ పత్రాల జారీ!

**బజార్హత్నూర్, మార్చి, 12(డిడి 9వార్త ):-**



బజార్ హత్నూర్ మండలం లోని కొలంగూడ గ్రామంలోగురువారం రోజు కొలామీ (PTG )గిరిజన కుటుంబాలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో నెల రోజులు వెదురు వస్తువుల తయారీ పై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.అట్లే బజార్ హత్నూర్ ఎంఎస్ ఆఫీస్లో కుట్టు మిషన్ & ఎంబ్రాయిడర్ పై శిక్షణ ముగింపు కార్యక్రమాల కు ఆదిలాబాద్ ఏడిఆర్డిఓ,ఏపిడి గోవింద్ రావ్ హాజరయ్యారు.ఏడిఆర్డిఓ మాట్లాడారు. వెదురుతో రకరకాల వస్తువులు ఎలా తయారు చేయాలనే దాన్నీ ఒక శిక్షణ పొందిన వ్యక్తిని నెలరోజుల పాటు కోలాంగూడలోనే ఉండి మహిళలకు అన్ని రకాల బొమ్మల తయారి పై శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. ఐకేపీ కార్యాలయంలో గత నెల రోజుల నుండి అనుభవం కలిగిన మహిళా శిక్షకురాలు తో మరో ముప్పై మంది మహిళలకు రకరకాల డ్రెస్ల పై దర్జీ పని పైన శిక్షణ ఇచ్చారు.వీరికి కూడా ధ్రువీకరణ పత్రాలు ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డీపియం నాన్ ఫామ్ వకుల,డిపిఎంలు రమాకాంత్, జ్ఞాను లు ఎస్విపి ఏపిఎం స్వామి,ఎస్విపి బోథ్ బ్లాక్ ఏపీఎం గణేష్,స్థానిక ఏపిఎం వెంకట్రెడ్డి, సీసీలు మహిళలు పాల్గొన్నారు.





## భయం వీడితే – పరీక్షలలో జయం మనదే

- **భయాన్ని వీడి ఆశావాద దృక్పథం పెంచుకోవాలి**
- **మంచి మార్కులు సూచనాలు**
- **మోటివేషనల్ స్పీకర్ & పోటీ**
- **పరీక్షల నిపుణులు రమణ గౌడ్ గొడిసెల**



**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ డిడి9 వార్త**

మార్చి నెల ప్రారంభమయ్యిందంటే విద్యార్థులకు పరీక్షల కాలం ప్రారంభమైనట్టే. ఇన్నాళ్లు చదివి నేర్చుకున్న పాఠాలను పరీక్షల రూపంలో రాసి మంచి మార్కులు సాధించాల్సిన సమయం ఇదే. అయితే పరీక్షలు సమీపిస్తున్న కొద్దీ ఎంత చదివినా ఇంకా ఏదో మిగిలిపోయిందనే ఆందోళన విద్యార్థుల్లో సహజంగానే కనిపిస్తుంది. కానీ భయపడకుండా ప్రశాంతంగా ఆలోచించి ధైర్యంగా పరీక్షలకు హాజరవ్వాలని మోటివేషనల్ స్పీకర్ మరియు పోటీ పరీక్షల నిపుణులు రమణ గౌడ్ గొడిసెల సూచించారు. పరీక్షలను భయంతో కాకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని ఆయన అన్నారు. ఇప్పటివరకు ఎన్నో పరీక్షలు రాసిన విద్యార్థులకు ఇది కొత్తేమీ కాదని, "నేను తప్పకుండా మంచి మార్కులు సాధిస్తాను" అనే నమ్మకం మనసులో బలంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా పదవ తరగతి పరీక్షలను పెద్ద సమస్యగా భావించకుండా, ఇప్పటివరకు చదివిన సబ్జెక్టులే ఇందులో ఉంటాయని గుర్తుంచుకోవాలని తెలిపారు. పరీక్షలు సమీపిస్తున్న సమయంలో కొత్త విషయాలు లేదా కొత్త మెటీరియల్ చదవకుండా, ఇప్పటివరకు చదివిన విషయాలను పునరావృతం చేయడం మంచిదని నిపుణులు చెబుతున్నారు. సబ్జెక్టులను కేవలం బట్టి చదవకుండా, కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుంటూ చదవడం ద్వారా ప్రశ్నలకు సులభంగా సమాధానం రాయగలమని వివరించారు. అలాగే గంటల తరబడి నిరంతరం చదవకుండా మధ్య మధ్యలో చిన్న విరామాలు తీసుకోవడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉండి చదివిన విషయాలు ఎక్కువ కాలం గుర్తుంటాయని తెలిపారు. చదివే ప్రదేశం శుభ్రంగా ఉండేలా చూసుకోవడంతో పాటు సరిపడా వెలుతురు ఉండాలని, చదివే సమయంలో మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని సూచించారు. పరీక్షలు పూర్తయ్యే వరకు విహార యాత్రలు లేదా ఇతర కార్యక్రమాలకు వెళ్లకుండా చదువుపైనే దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. అన్ని సబ్జెక్టులను సమానంగా చూడాలని, ఒకే సబ్జెక్టులో ఫెయిల్ అయినా మొత్తం పరీక్షలో ఫెయిల్ అయినట్టేనని గుర్తుంచుకోవాలని అన్నారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ వంటి భాషా సబ్జెక్టుల్లో గ్రామర్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలని, ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం వంటి సబ్జెక్టుల్లో సూత్రాలు, సమీకరణాలు, ఫార్ములాలను బాగా ప్రాక్టీస్ చేయాలని సూచించారు. సైన్స్ సబ్జెక్టుల్లో డయాగ్రామ్స్‌ను సరిగ్గా ప్రాక్టీస్ చేయడం కూడా మార్కులు పెరగడానికి సహాయపడుతుందని తెలిపారు. పరీక్ష హాల్లో ప్రశ్నపత్రం తీసుకున్న వెంటనే రాయకుండా మొదట అన్ని ప్రశ్నలను పూర్తిగా చదవాలని, బాగా తెలిసిన ప్రశ్నలకు ముందుగా సమాధానాలు రాయాలని సూచించారు. జవాబుల్లో హెడ్డింగ్‌లు, సబ్ హెడ్డింగ్‌లు, ముఖ్యమైన పాయింట్లు స్పష్టంగా రాస్తే పేపర్ దిద్దే వారికి సులభంగా అర్థమై మంచి మార్కులు వచ్చే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. అలాగే పరీక్ష పూర్తయ్యాక పేపర్‌ను ఒకసారి చెక్ చేసుకోవడం కూడా చాలా ముఖ్యమని తెలిపారు. భయాన్ని విడిచి ధైర్యంగా, ఆశావాద దృక్పథంతో పరీక్షలకు హాజరవుతే విజయం ఖచ్చితంగా సాధ్యమని నిపుణులు పేర్కొన్నారు.



# బోధన్ ఉషోదయ విద్యాసంస్థల్లో మెగా జాబ్ మేళా

- **277 మందికి ఉద్యోగ అవకాశాలు**
- **పాల్గొన్న 11 ప్రముఖ కంపెనీలు**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని ఉషోదయ విద్యాసంస్థల ఆధ్వర్యంలో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సహకారంతో బోధన్‌లోని ఉషోదయ డిగ్రీ కళాశాల వేదికగా గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నిరుద్యోగ యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ జాబ్ మేళాలో 11 ప్రముఖ కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొని, అభ్యర్థుల ప్రతిభను పరిశీలించారు. మొత్తం 423 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరుకాగా, వారిలో 277 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులకు ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్యప్రకాష్, ఆయా కంపెనీల ప్రతినిధుల చేతుల మీదుగా ప్రొవిజనల్ ఆఫర్ లెటర్లను అందజేశారు.

**అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి : సూర్యప్రకాష్**

ఈ సందర్భంగా ఉషోదయ కళాశాల చైర్మన్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ.. ఉద్యోగాల కోసం హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు తిరగాల్సిన అవసరం లేకుండా నేరుగా మీ పట్టణానికే కంపెనీలను రప్పించి ఇక్కడ జాబ్ మేళా నిర్వహించాం. ప్రారంభంలో వేతనం కంటే ఆ ఉద్యోగంలో మీరు నేర్చుకునే నైపుణ్యాలు మీ అంకితభావం, క్రమశిక్షణే భవిష్యత్తులో మీకు మంచి ఆర్థిక అవకాశాలను అందిస్తాయి. రిమోట్ ఏరియాలో ఉన్న విద్యార్థులకు సైతం తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందిస్తూ, ఉపాధి కల్పించడమే మా సంస్థ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఆర్ ప్రతినిధులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. నేటి జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని అభ్యర్థులకు మంచి వేతన ప్యాకేజీలు అందించాలని కోరారు. సంస్థ తరపున ఎల్లప్పుడూ సహకారం అందిస్తున్న టాస్క్ ప్రతినిధులు రఘు, లక్ష్మణ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీల ప్రతినిధులను ఉషోదయ విద్యాసంస్థల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఉషోదయ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, అధ్యాపకులు హరికృష్ణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# మున్సిపల్ పాలనలో ప్రజా ప్రతినిధులదే కీలకం

- పాలనాపరమైన మెళకువలు నేర్చుకోవాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి
- వనరుల పెంపుదలపై దృష్టి పెట్టాలి : ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

స్థానిక సంస్థల పాలనలో ప్రజా ప్రతినిధులు క్రియాశీలకంగా వ్యవహరించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో పనిచేయాలని నిజమబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పిలుపునిచ్చారు. నిజామాబాద్ నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్‌లో నగర మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపల్ చైర్‌పర్సన్లకు ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరాన్ని ఆమె, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు కేవలం పాలసీ మేకర్లు మాత్రమే కాదు, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించే ఎగ్జిక్యూటర్లు. మీ వార్డుకు మీరే సీఈవోలు. మీ పరిధిలోని ఆస్తులను, ట్రేడ్ లైసెన్స్‌లను సమర్థవంతంగా నిర్వహించి ఆదాయాన్ని పెంచుకోవాలి. రాజీవ్ గాంధీ ఆడిటోరియం వంటి ఆస్తులను ఆధునీకరించి, ఆదాయ వనరులుగా మార్చుకోవాలి. వార్డు వారీగా సమస్యలను గుర్తించి, పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే మీరు ఎన్నికయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. శానిటేషన్ సమస్యలపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారుల తీరును నా దృష్టికి తీసుకురండని కోరారు. ప్రజా ప్రతినిధులు మున్సిపల్ యాక్ట్ పుస్తకాన్ని క్షుణ్ణంగా చదివి, పాలనాపరమైన నియమ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వం ఇచ్చే నిధులను ఎలా సద్వినియోగం చేసుకోవాలో ప్రణాళికాబద్ధంగా ఆలోచించాలని, కరీంనగర్, వరంగల్ వంటి నగరాలతో పోటీ పడేలా నిజామాబాద్‌ను అభివృద్ధి చేయాలని నాయకులు సూచించారు. ఈ శిక్షణ శిబిరంలో మేయర్ ఉమారాణి, వివిధ మున్సిపాలిటీల చైర్‌పర్సన్లు, కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.





## గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యం.. ఎండలో వినియోగదారులు పడిగాపులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని గోశాల వద్ద గురువారం వంట గ్యాస్ సరఫరాలో చోటుచేసుకున్న గందరగోళం వినియోగదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. గ్యాస్ సిలిండర్ల కోసం ఉదయం నుంచే వందలాది మంది ప్రజలు ఖాళీ సిలిండర్ల తో క్యూ కట్టారు. గ్యాస్ వాహనం సకాలంలో రాకపోవడంతో దాదాపు మూడు గంటల పాటు ఎండలోనే వేచి చూడాల్సి వచ్చింది. ఏజెన్సీ నిర్వాహకుల వైఖరిపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. స్థానికుల ఆందోళన గమనించిన బిఆర్ఎస్ నాయకులు ముషీర్ బాబా, గుమ్ముల అశోక్‌రెడ్డి వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్న వారు గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడి నిలదీశారు. ఏజెన్సీ బాధ్యతారాహిత్యం వల్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పట్టణ సీఐ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ సందర్భంగా సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ.. గ్యాస్ కొరత ఏమీ లేదని, వినియోగదారులకు అవసరమైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఏజెన్సీదేనని స్పష్టం చేశారు. ఇకపై గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులందరికీ నేరుగా వారి ఇళ్లకే సిలిండర్లు సరఫరా చేయాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఎండలో ఇబ్బంది పడుతున్న ప్రజలను గమనించిన నాయకులు ముషీర్ బాబా, అశోక్‌రెడ్డి వెంటనే తాత్కాలికంగా టెంట్‌ను ఏర్పాటు చేయించి, తాగునీటి సౌకర్యం కల్పించారు. దీంతో వినియోగదారులు కొంత ఉపశమనం పొందారు. కష్ట సమయంలో తమకు అండగా నిలిచిన కౌన్సిలర్లకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



## పొతంగల్‌లో శివాజీ సేన యూత్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

నవీపేట్ మండలం పొతంగల్‌లో శివాజీ సేన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం నవీపేట్ ఎస్సై శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో బాటసారుల దాహాన్ని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. యువత ఇలాంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం గొప్ప విషయమని, ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. ప్రజలకు, ముఖ్యంగా ప్రయాణికులకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పొతంగల్ ఉప సర్పంచ్ సతీశ్, శివాజీ సేన యూత్ సభ్యులు సౌద శ్రీను, సౌదా మల్లయ్య, వినోద్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



## దొంగతనానికి పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలు శిక్ష

- తీర్పునిచ్చిన ఆర్మూర్ ఫస్ట్ ఏజేఎఫ్‌సీఎం కోర్టు

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

దొంగతనం కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఆర్మూర్ ఫస్ట్ ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి భవ్య శ్రీ గురువారం తీర్పు వెల్లడించారు. ఈ వివరాలను సిరికొండ ఎస్సై రామకృష్ణ విలేకరులకు వెల్లడించారు. సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెట్టుమరి తండాకు చెందిన కేతావత్ రవి, 2019వ సంవత్సరంలో అజ్మీర్ బులిబాయి అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. బీరువాను తెరిచి అందులో ఉన్న రూ. 50 వేల నగదును అపహరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరం రుజువు కావడంతో ఆర్మూర్ కోర్టు న్యాయమూర్తి భవ్య శ్రీ నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ కేసులో సాక్ష్యాధారాలను సేకరించి, కోర్టులో పటిష్ఠంగా వాదించి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు బృందాన్ని ఎస్సై రామకృష్ణ అభినందించారు.

## మహిళా శక్తిని చాటిన బాలనగర్ పాఠశాల

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

జక్రాన్‌పల్లి మండలం బాలనగర్ ప్రాథమికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని, అక్షర రూపంలో సమాజానికి విజ్ఞానాన్ని అందించే ఉపాధ్యాయినుల సేవలు అభినందనీయమని కొనియాడారు. నేటి సమాజం మహిళా సాధికారతే లక్ష్యంగా ముందుకు సాగుతోందని, ప్రతి రంగంలోనూ మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారని అన్నారు. బాలికలకు సరైన విద్యను అందించి, వారిని ఉన్నత శిఖరాలకు చేర్చడమే మన ముందున్న బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం పురోగమిస్తుందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళా దినోత్సవ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.



## అసెంబ్లీలో ఆశా వర్కర్ల సమస్యలను లేవనెత్తాలి

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్యలపై చర్చించాలని కోరుతూ సిఐటియు నాయకులు గురువారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశా వర్కర్లు క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యానికి అందిస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ఆశా వర్కర్లకు రూ. 18,000 కనీస వేతనం చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న మూడు నెలల బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. వీటితో పాటు ఇతర సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మెల్యేను కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, అసెంబ్లీలో ఆశా వర్కర్ల వేదనను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆశా వర్కర్ల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 17న టీయూలో మెగా జాబ్ ఫెయిర్

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

తెలంగాణ విశ్వవిద్యాలయంలోని ట్రైనింగ్ & ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ సహకారంతో ఈ నెల 17న డిచ్‌పల్లి క్యాంపస్‌లో మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు జాబ్ ఫెయిర్‌కు సంబంధించిన పోస్టర్లను వైస్ ఛాన్సలర్ ప్రొ. యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మెగా జాబ్ ఫెయిర్‌లో 500కు పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయని, అర్హులైన అభ్యర్థులను ఆయా సంస్థలు ఎంపిక చేస్తాయని తెలిపారు. స్థానిక విద్యార్థులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో హాజరు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, ప్లేస్‌మెంట్ సెల్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## నిందితులను కఠినంగా శిక్షించాలి

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

ధర్పల్లి మండల కేంద్రంలో జరిగిన బంజారా మహిళ హత్యోదంతంపై అఖిల భారత బంజారా సేవా సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఏఐబీఎస్ మండల అధ్యక్షుడు స్వామి నాయక్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఐబీఎస్ మండల అధ్యక్షుడు స్వామి నాయక్ మాట్లాడుతూ.. సీతాయిపేట గ్రామానికి చెందిన కాంతిని అమానుషంగా హత్య చేయడం అత్యంత హేయమైన చర్య అని పేర్కొన్నారు. నిందితులను గుర్తించి, వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలమైందని, దాడులు చేస్తున్న వారికి కనీస భయం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని, న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐబీఎస్ జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయక్, డివిజన్ అధ్యక్షుడు శంకర్ నాయక్, నాయకులు మోహన్ నాయక్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.





## భీంగల్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**



భీంగల్ పట్టణంలో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని కాంగ్రెస్ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని 3వ వార్డు, దేవి ఆలయం సమీపంలో ఎంతో కాలంగా అసంపూర్తిగా ఉన్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ ప్రాంతంలో రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో బురదమయమై, నిత్యం రాకపోకలకు స్థానికులు, పాఠశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. నడవలేని పరిస్థితి ఉన్న ఈ మార్గంలో సీసీ రోడ్డు నిర్మించాలని గత కొంతకాలంగా స్థానికులు కోరుతున్నారు. ప్రజల సమస్యను గుర్తించిన ముత్యాల సునీల్ కుమార్, సంబంధిత అధికారులతో మాట్లాడి నిధుల మంజూరుకు ప్రత్యేక చొరవ చూపారు. దీంతో పనులు ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు, నంది గల్లి పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రతి వీధి, ప్రతి కాలనీ అభివృద్ధి చెందాలనే సంకల్పంతో తాము పని చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాలకు పెద్దపీట వేస్తామన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని, నిర్ణీత సమయంలోగా రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొద్దురే నాగమణి స్వామి, వైస్ ఛైర్మన్ జేజేలత, జేజే నర్సయ్య, 3వ వార్డు కౌన్సిలర్ తోటా సతీష్, 2వ వార్డు కౌన్సిలర్ పర్సా అనంతరావు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు నల్లూరి గంగమణి, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, వార్డు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచులు గ్రామ ప్రగతి ప్రదాతలు కావాలి

- 99 రోజుల ప్రణాళికతో పల్లెల రూపురేఖలు మార్చాలి
- నిధుల వినియోగంలో అలసత్వం వద్దు: అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్ -
- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధికి సహకరించండి: ఎమ్మెల్యే భూపతి రెడ్డి

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**







గ్రామస్థాయిలో పరిపాలనను బలోపేతం చేస్తూ, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రకటించిన '99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'ను విజయవంతం చేయాలని నిజామాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, రూరల్ శాసనసభ్యులు భూపతి రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామ సభలకున్న ప్రాధాన్యతను వివరించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, కేటాయించిన నిధుల్లో 70 శాతం ఖర్చు చేసి మార్చి నెలాఖరులోగా వినియోగ ధృవీకరణ పత్రాలు సమర్పించాలని ఆదేశించారు. లేనిపక్షంలో తదుపరి విడత నిధులు నిలిచిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, పారిశుధ్య నిర్వహణలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచ్ పదవి గ్రామ స్థాయిలో ఒక ముఖ్యమంత్రి హోదాతో సమానమని, ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. రాజకీయ వైషమ్యాలకు తావులేకుండా శాసన సభ్యులు, అధికారుల సమన్వయంతో పల్లెలను అభివృద్ధి పథంలో నడిపించాలని సూచించారు. మహిళా సర్పంచులు తమ పనితీరుతో ఆదర్శంగా నిలవాలని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, అంగన్‌వాడీల పర్యవేక్షణలో చురుగ్గా పాల్గొనాలని కోరారు. గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలన్న మహాత్మా గాంధీ మాటలను స్మరిస్తూ, స్వచ్ఛమైన గాలి, నీరు, మెరుగైన విద్య, వైద్యం అందేలా ప్రతి సర్పంచ్ అహర్నిశలు కృషి చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ, జడ్పీ సీఈఓ, వివిధ మండలాల ఎంపీడీఓలు, సర్పంచులు పాల్గొన్నారు.

# ఫీజు బకాయిల విడుదల కోసం పోరాటం



- 15న ధర్నా చౌక్‌లో ఫీజు పోరు దీక్ష

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో ఫీజు పోరు దీక్ష చేపట్టనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ ప్రకటించారు. నిజామాబాద్‌లోని కార్యాలయంలో ఈ దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరాల సుధాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్కాలర్‌షిప్ నిధుల విడుదలలో తీవ్ర జాప్యం చేస్తోందని, దీనివల్ల బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల ఉన్నత విద్యకు తీవ్ర ఆటంకం కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు, బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ దీక్షలో విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బుస్స ఆంజనేయులు మాట్లాడుతూ.. పేదలకు ఉచిత విద్య, వైద్యం అందుబాటులో ఉంటేనే వారు సుఖసంతోషాలతో ఉంటారని, వారికి మరే ఇతర సహాయం అవసరం ఉండదని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, సాయి బసవ, బగ్గలి అజయ్, రేఖ, కోడూరు స్వామి, సురేందర్, శ్రీకాంత్, రుక్మిణి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఇమ్మడి గోపి ముదిరాజ్ హత్య పిరికిపంద చర్య

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**



ముదిరాజ్ సామాజిక వర్గ రాజకీయ చైతన్యంలో కీలక పాత్ర పోషిస్తున్న ఇమ్మడి గోపి ముదిరాజ్ హత్యకు గురికావడం అత్యంత దారుణమని, ఇది పిరికిపంద చర్య అని జిల్లా యువజన విభాగం నాయకుడు సున్నపు ఓంకార్ తీవ్రంగా ఖండించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ముదిరాజ్ సంఘం బలోపేతానికి గోపి ముదిరాజ్ విశేష కృషి చేశారని ఓంకార్ గుర్తు చేశారు. మండల పరిషత్ అధ్యక్షుడిగా ప్రజలతో మమేకమై, అన్ని వర్గాల అభివృద్ధికి పాటుపడిన నాయకుడిని కోల్పోవడం సమాజానికి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజులను ఎల్లప్పుడూ ఆదుకునే నాయకుడిగా ఆయనకు మంచి గుర్తింపు ఉందన్నారు. ఈ హత్యకు పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని సున్నపు ఓంకార్ డిమాండ్ చేశారు. ఘటనకు కారకులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధితుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని ఆయన కోరారు. ఇమ్మడి గోపి ముదిరాజ్ ఆశయాలను కొనసాగిస్తామని, దోషులను శిక్షించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

# విద్యార్థులకు చెస్ బోర్డుల పంపిణీ




**బీర్కూర్, మార్చి 12 (డిడి9 వార్త):**

విద్యార్థుల్లో చెస్ ఆటపై ఆసక్తిని పెంపొందించేందుకు చెస్ బోర్డు ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు చెస్ బోర్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ చెస్ ఆట విద్యార్థుల్లో ఆలోచనా శక్తి, ఏకాగ్రత మరియు నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. విద్యతో పాటు క్రీడలు కూడా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా చెస్ వంటి మేధోక్రీడలు పిల్లల్లో తార్కిక ఆలోచనను పెంపొందించి భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకన్న, చెస్ బోర్డు సభ్యులు సిద్ధంశెట్టి నారాయణ, కిరణ్, నాయకులు మియాపురం శశికాంత్, నాగేళ్ల సాయికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు. చెస్ బోర్డులు అందుకున్న విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.




# బాధ్యతాయుతమైన సేవలకు గుర్తింపు

- నంది అందుకున్న ఎతరాజు నాగరాజు

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

సమాజ సేవలో నిరంతరం తపిస్తున్న వరంగల్ జిల్లాకు చెందిన ఎతరాజు నాగరాజుకు అరుదైన గౌరవం దక్కింది. నిస్వార్థంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నందుకు గాను, మంగళవారం హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆయనకు ప్రతిష్ఠాత్మక నంది అవార్డును ప్రదానం చేశారు. హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంగళపెల్లి హుస్సేన్ దిశానిర్దేశంలో నాగరాజు సేవాపథంలో పయనిస్తున్నారు. ముఖ్యంగా కరోనా కష్టకాలంలో అంబులెన్స్ సేవలు అందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. ఇప్పటివరకు 32 సార్లు రక్తదానం చేసి, ఎంతోమంది ప్రాణాలను కాపాడటంలో తనవంతు కృషి చేశారు. క్రమశిక్షణతో కూడిన బాధ్యతాయుతమైన సేవలను గుర్తించిన కమిటీ ఆయనను ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. అవార్డు అందుకున్న అనంతరం నాగరాజు మాట్లాడుతూ... ఈ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది. నాకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. భవిష్యత్తులో మరింత అంకితభావంతో సమాజ సేవ చేస్తానని ఉద్వేగంగా తెలిపారు. నాగరాజుకు ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీ సభ్యులు, శ్రేయోభిలాషులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.




# బాల్కొండలో విద్యుత్ పల్లెబాట

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

వినియోగదారులకు అంతరాయం లేని, నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యంగా బాల్కొండ సబ్ స్టేషన్ సిబ్బంది విద్యుత్ పల్లెబాట కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ప్రతి గురువారం గ్రామాల్లో పర్యటిస్తూ విద్యుత్ వ్యవస్థను మెరుగుపరిచే దిశగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా గురువారం బాల్కొండలోని 16వ వార్డులో అసిస్టెంట్ ఇంజనీర్ కిషన్ ఆధ్వర్యంలో సిబ్బంది విస్తృత పనులు చేపట్టారు. విద్యుత్ స్తంభాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించడం, వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేయడం, తీగలను సరిదిద్దడం వంటి పనులను లైన్ మెన్లు నరసయ్య, మల్లేష్, లక్ష్మణ్, నవీన్, సత్యం, సోమయ్య, రమేష్‌లతో కలిసి పూర్తి చేశారు. వార్డు సభ్యులు తెడ్డు సందీప్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని సిబ్బందికి సహకరించారు. ప్రతి వారం పల్లెబాట పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తున్న బాల్కొండ సబ్ స్టేషన్ సిబ్బంది పనితీరు పట్ల నిజామాబాద్ జిల్లా మానవ హక్కుల కౌన్సిల్ సామాజిక సాంస్కృతిక విభాగం అధ్యక్షులు బ్రహ్మరవుతు నర్సింగ్ రావు, కార్యదర్శి సుతావే సంతోష్ కుమార్, డాక్టర్ పవన్ హర్షం వ్యక్తం చేశారు. అధికారుల చొరవ వల్ల గ్రామాల్లో ప్రమాదాలు తగ్గుతాయని, నిరంతర విద్యుత్ సరఫరాకు మార్గం సుగమం అవుతుందని వారు కొనియాడారు.




# పిసిపిఎన్‌డిటి చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి

- జిల్లా సలహా సంఘం సమావేశంలో డిఎంహెచ్‌వో బి.రాజశ్రీ
- అనుమతి లేకుండా స్కానింగ్ మిషన్ల తరలింపు నేరం

**నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు నిషేధ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రాజశ్రీ హెచ్చరించారు. గురువారం డిఎంహెచ్‌వో కార్యాలయంలో ఆమె అధ్యక్షతన పిసిపిఎన్‌డిటి జిల్లా స్థాయి సలహా సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రాజశ్రీ మాట్లాడుతూ... చట్ట ప్రకారం నమోదు చేసుకున్న వైద్యులు మాత్రమే స్కానింగ్ మిషన్లను వినియోగించాలని స్పష్టం చేశారు. కొత్తగా మిషన్ కొనుగోలు చేయాలన్నా, లేదా ఉన్న మిషన్లను ఒక ఆసుపత్రి నుంచి మరో ఆసుపత్రికి బదలాయించాలన్నా ముందుగా జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి అనుమతి లేకుండా మిషన్లను తరలిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్కానింగ్ సమయంలో పుట్టబోయే శిశువు లింగాన్ని (అమ్మాయా, అబ్బాయా) వెల్లడించడం చట్టప్రకారం నేరమని ఆమె నొక్కి చెప్పారు. ఇలాంటి సమాచారం ఇచ్చి గర్భ విచ్ఛిత్తికి పాల్పడితే ఎంటిపి చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాజంలో లింగ నిష్పత్తి పడిపోవడానికి ఇటువంటి అక్రమ పరీక్షలే కారణమని, అమ్మాయి, అబ్బాయి సమానమేనన్న భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్వేత (రేడియాలజిస్ట్), డాక్టర్ ఇందు (గైనకాలజిస్ట్), డాక్టర్ ప్రభావతి (చిల్డ్రన్ స్పెషలిస్ట్), ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సుప్రియ, డాక్టర్ శిఖర, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రేమలత, స్వచ్ఛంద సేవా సంఘం ప్రతినిధి పద్మాసింగ్, డిహెచ్ఇ వేణుగోపాల్, హెచ్ఇఓ సురేష్ పాల్గొన్నారు.




# విద్యార్థులకు జీవన విధానం, నైతిక విలువలు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమం

**బీర్కూర్, మార్చి 12(డిడి9 వార్త):**

బీర్కూర్ పి ఎం శ్రీ జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో 9వ, 10వ తరగతి విద్యార్థినీవిద్యార్థులకు జీవన విధానం, నైతిక విలువలు మరియు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ సైకాలజిస్ట్ మరియు వ్యక్తిత్వ వికాస నిపుణుడు కే. రామచంద్రుడు విద్యార్థులకు మార్గదర్శనం చేశారు.ఈ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి వెంకన్న ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కే. రామచంద్రుడు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో విద్యార్థులు ఎలాంటి విద్యను అభ్యసించాలి, పరీక్షలకు ఎలా సిద్ధం కావాలి, ఉన్నత లక్ష్యాలను ఎలా సాధించాలి వంటి అంశాలపై విద్యార్థులకు స్పష్టంగా వివరించారు. గతంలో వేలాది మంది విద్యార్థులకు కెరీర్ కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించిన అనుభవంతో శాస్త్రీయ మానసిక అంచనా పద్ధతులను ఉపయోగించి సరైన కెరీర్ మార్గాన్ని ఎలా ఎంచుకోవాలో సూచనలు ఇచ్చారు.అలాగే కార్పొరేట్ ట్రైనర్‌గా సాఫ్ట్ స్కిల్స్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్, పబ్లిక్ స్పీకింగ్, వ్యక్తిత్వ బ్రాండింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, టీం వర్క్, ఒత్తిడి నియంత్రణ, సమయ నిర్వహణ, మంచి అలవాట్లు ఏర్పరచుకోవడం, లక్ష్య సాధన కోసం ప్రణాళికలు రూపొందించుకోవడం వంటి అంశాలపై కూడా విద్యార్థులకు సవివరంగా అవగాహన కల్పించారు.జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించడానికి క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, నైతిక విలువలు ఎంతో అవసరమని ఆయన తెలిపారు. విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడానికి నిరంతర శ్రమ, పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శివరాం, ఏటీఎం ఇన్‌చార్జి రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.



# స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం తిరస్కారం

- సభలో అధికార, ప్రతిపక్షాల వాగ్వాదం
- ప్రతిపక్షం ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నిస్తోంది
- ఎంపీలపై హోమంత్రి అమిత్ షా ఆగ్రహం
- సభ్యులందరికీ మాట్లాడే హక్కుందని వెల్లడి
- సభను మార్కెట్‌లా నడపలేమని వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

లోక్‌సభలో స్పీకర్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం చివరకు మూజువాణి ఓటుతో తిరస్కరించబడింది. తీర్మానంపై జరిగిన చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ముఖ్యంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా మరియు ప్రతిపక్ష నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేయడంతో సభలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. చర్చలు ముగిసిన అనంతరం సభలో ఓటింగ్ నిర్వహించగా, ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందలేదు. దీంతో స్పీకర్‌పై పెట్టిన తీర్మానం వీగిపోయినట్లు ప్రకటించారు. అనంతరం సభను మరుసటి రోజుకు వాయిదా వేశారు.

**చర్చల సందర్భంగా ఉద్రిక్తత**

స్పీకర్‌పై ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో విస్తృత చర్చ జరిగింది. ఈ సందర్భంగా అధికార పక్షం మరియు ప్రతిపక్ష సభ్యులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ప్రత్యేకంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా తన ప్రసంగంలో ప్రతిపక్షాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. స్పీకర్ పదవిపై అనుమానాలు వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీసే చర్యగా ఆయన పేర్కొన్నారు.

**అమిత్ షా వ్యాఖ్యలు**

స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం అసాధారణ పరిణామమని అమిత్ షా అన్నారు. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత లోక్‌సభ స్పీకర్‌పై ఇలాంటి తీర్మానం రావడం విచారకరమని ఆయన వ్యాఖ్యానించారు. స్పీకర్ పదవి అనేది అధికార పక్షానికీ, ప్రతిపక్షానికీ సమానంగా వ్యవహరించే ఒక నిష్పాక్షిక స్థానం అని ఆయన చెప్పారు. ఆ పదవిపై అనుమానాలు వ్యక్తం చేయడం సరైన పద్ధతి కాదని ఆయన స్పష్టం చేశారు.

**సభా వ్యవస్థపై వ్యాఖ్యలు**

లోక్‌సభ కార్యకలాపాలు పూర్తిగా పార్లమెంటరీ నిబంధనల ప్రకారం సాగుతాయని అమిత్ షా తెలిపారు. సభను రాజకీయ పార్టీల నిర్ణయాల ప్రకారం కాకుండా, రాజ్యాంగం మరియు నిబంధనల ప్రకారం నడిపిస్తారని చెప్పారు. సభలో ప్రతి సభ్యుడికి మాట్లాడే హక్కు ఉన్నప్పటికీ ఆ హక్కు నియమ నిబంధనల పరిధిలోనే ఉండాలని ఆయన వివరించారు.

**గత చరిత్రను ప్రస్తావించిన షా**

భారత పార్లమెంటరీ చరిత్రలో లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం రావడం చాలా అరుదైన విషయం అని అమిత్ షా పేర్కొన్నారు. గత 75 సంవత్సరాల పార్లమెంటరీ చరిత్రలో ఇలాంటి సంఘటనలు చాలా తక్కువగా జరిగాయని చెప్పారు.భారతీయ జనతా పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా ఎప్పుడూ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టలేదని ఆయన గుర్తు చేశారు. అప్పట్లో బీజేపీ నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించిందని అన్నారు.





**ప్రజాస్వామ్య విలువలపై వ్యాఖ్యలు**

స్పీకర్‌పై అనుమానాలు వ్యక్తం చేయడం అంటే ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తడమేనని అమిత్ షా వ్యాఖ్యానించారు. సభా కార్యకలాపాలు పరస్పర విశ్వాసంపై ఆధారపడి ఉంటాయని ఆయన చెప్పారు.సభలోని సభ్యులు ఒకరిపై ఒకరు గౌరవంతో వ్యవహరించడం చాలా అవసరమని అన్నారు.

**సభ నియమాల ప్రాముఖ్యత**

సభలో చర్చలు, వాదోపవాదాలు సహజమే అయినప్పటికీ అవి నిబంధనల పరిధిలోనే జరగాలని అమిత్ షా పేర్కొన్నారు. సభను మార్కెట్‌లా లేదా పండుగలా నడపలేమని ఆయన వ్యాఖ్యానించారు.పార్లమెంటరీ వ్యవస్థలో నియమాలు అత్యంత ముఖ్యమని చెప్పారు.

**ప్రతిపక్షాల ఆగ్రహం**

అమిత్ షా తన ప్రసంగంలో చేసిన కొన్ని వ్యాఖ్యలపై ప్రతిపక్ష సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై ఆయన చేసిన వ్యాఖ్యలపై విపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి.గతంలో జరిగిన ఒక సంఘటనను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీపై విమర్శలు చేయడంతో ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందించాయి. వెంటనే ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని, క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి.

**సభలో నినాదాలు**

ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. దీనితో సభలో కొంతసేపు గందరగోళం నెలకొంది. అధికార పక్ష సభ్యులు కూడా ప్రతిస్పందించడంతో వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది.



## కొత్తగూడా,రాంపూర్లోపశువులకు ఉచిత టీకాలు.

**బజార్హత్నూర్,మార్చి,12(డిడి 9వార్త ):-**

బజార్హత్నూర్ మండలంలోని రాంపూర్, కొత్తగూడ గ్రామాలలోగురువారం రోజు ఉచిత గాలికుంటు నివారణ టీకాల శిభిరం నిర్వహించి పశువులకు, గేదెలకు,మేకలు, గొర్రెలులకు టీకాలు వేసినట్లుపశువైద్య బృందంతెలిపింది.ఈకార్యక్రమంలో అందుగూడ గ్రామ సర్పంచ్ పెందుర్ సంగీత, సిబ్బంది సిహెచ్ అరవింద్, మారుతీ, దుర్గాజీ,ఠాకూర్ సూరజ్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## కామారెడ్డిలో ఫ్లయింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి వినతి

**కామారెడ్డి, మార్చి 12(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఫ్లయింగ్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరుతూ కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ప్రకటన విడుదల చేస్తూ మాట్లాడుతూ, రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతో పాటు జాతీయ రహదారి, రైల్వే స్టేషన్ వంటి రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండటం కామారెడ్డికి ప్రత్యేకత అని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంలో ప్రభుత్వానికి చెందిన విస్తారమైన భూమి అందుబాటులో ఉందని, ఇక్కడ ఫ్లయింగ్ అకాడమీ ఏర్పాటు చేస్తే కామారెడ్డి అభివృద్ధికి దోహదపడటమే కాకుండా యువతకు పైలెట్ శిక్షణ అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.ఫ్లయింగ్ అకాడమీ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా విమానయాన రంగంలో నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ అంశంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు



## ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి విజేతలుగా నిలవాలి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 12 మార్చి(డీడీ9 వార్త) :**

పదో తరగతి విద్యార్థులు పరీక్షల పట్ల భయాందోళనలు వీడి, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసినప్పుడే అత్యుత్తమ ఫలితాలు సాధించగలరని తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసీరామ్ పిలుపునిచ్చారు. బుధవారం బోధన్ డివిజన్ పరిధిలోని స్థానిక కళాశాలలో విద్యార్థుల కోసం నిర్వహించిన పరీక్షల ప్రేరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా, దృఢ సంకల్పంతో చదవాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా చదివితే పదికి పది జీపీఏ సాధించడం అసాధ్యమేమీ కాదని స్పష్టం చేశారు. విద్యార్థులు తమను తాము ఇతరులతో పోల్చుకోకుండా, ప్రశాంతమైన మనసుతో సమయ పాలన పాటిస్తూ సంసిద్ధం కావాలని కోరారు. పరీక్ష రోజు ఉదయాన్నే సంతోషంగా నిద్రలేవాలని, కావాల్సిన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. పరీక్ష గదిలో ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదివి, తెలిసిన సమాధానాలను చక్కగా రాయడం ద్వారా మంచి మార్కులు సాధించవచ్చని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు స్రవంతి, జ్యోతి, స్వాతిక, మౌనిక, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





## బోథ్‌లో ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్

**ఆదిలాబాద్ జిల్లా, బోథ్ మార్చ్ 12(డి డి 9)**

బోథ్ పట్టణ కేంద్రంలోని జామా మసీదులో బోథ్ సర్పంచ్ కుర్మే అన్నపూర్ణ మహేందర్ గారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్. ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేసి, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ గారు మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్రత, శాంతికి ప్రతీక అని అన్నారు. ఉపవాస దీక్ష ద్వారా మానవత్వం, సేవాభావం పెంపొందుతాయని తెలిపారు. సమాజంలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో, ఐక్యంగా జీవించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు మతభేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ పరస్పరం గౌరవించుకుంటూ. సామరస్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. వారి ప్రార్థనలు దేశం మరియు రాష్ట్రానికి శాంతి, సౌభాగ్యం తీసుకురావాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, పార్టీ నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

- ఎమ్మెల్యే శ్రీగణేశ్
- అంబేద్కర్ నగర్‌లో సీసీ కెమెరాల ప్రారంభం

**సికింద్రాబాద్, మార్చి 12 ( డీడీ9 వార్త ):**

ప్రమాదాలు, నేరాలను అరికట్టడంలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మోండా డివిజన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ బస్తీలో కాంగ్రెస్ నాయకుడు సంతోష్ యాదవ్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల ద్వారా దొంగతనాలు, అవాంఛనీయ ఘటనల్లో నిందితులను గుర్తించడం సులభమవుతుందని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలకు దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగేష్ యాదవ్, వైష్ణవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.






## పొన్న గ్రామంలో జన శిక్షన్ సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంబ్రాయిడింగ్ శిక్షణ శిబిరం

- మహిళలు అన్ని రంగాలలో ముందు ఉండాలి.

**పొన్న 12 మార్చ్ (డిడి9 వార్త న్యూస్):**

సిరికొండ మండలం పొన్న గ్రామంలో జన్ శిక్షన్ సంస్థాన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పొన్న గ్రామంలో ఉన్న గృహిణులకు ఎంబ్రాయిడింగ్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసి, మూడు నెలలుగా మహిళలకు ఎంబ్రాయిడింగ్ శిక్షణ ఇచ్చారు. మూడు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్ అందజేశారు.ఈ సందర్భంగా జన్ శిక్షన్ సంస్థాన్ ఏపీవో శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ఆర్థిక అభివృద్ధిలో ముందుకెళ్లాలని, తమ కుటుంబానికి తాము అండగా నిలబడే విధంగా ఉండాలనే ఉద్దేశంతో ఎంబ్రాయిడింగ్ శిక్షణ ఇవ్వడం జరిగిందని, దీని తర్వాత టైలరింగ్ శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుందని ఆయన అన్నారు .ఈ కార్యక్రమంలో జె ఎస్ ఎస్ ఏపీవో శ్రీకాంత్ మరియు ఎంబ్రాయిడింగ్ ట్రైనర్ వృందన మరియు శిక్షణ పొందిన యువతులు మహిళలు పాల్గొనడం జరిగినది.




## అఖండ హరినామ సప్తా సమాప్తం.

**బజార్ హత్నూర్, మార్చి 12(డిడి9వార్త ):-**

బజార్ హత్నూర్ మండలం లోని గంగాపూర్ గ్రామంలో గత 5 వ తేదీ నుంచి 12 వ తేదీ వరకు అఖండ హరినామ సప్తా జరిగింది. గురువారం రోజు ముగింపు కార్యక్రమంలో 11 వ తేదీ రోజు శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతీ స్థాపన జరుగగా, 12 తేది కలషారోహణ మూర్తి స్థాపన, ముగింపు కార్యక్రమం శ్రీ హరిభక్త నారాయణ మహారాజ్, మాదాపూర్ వారి అధ్వర్యంలో జరిగినట్లు ఆ గ్రామ ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా హరీ భజనలు, అన్న ప్రసాదం వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహారాజ్ తో పాటుగా సర్పంచ్ టెకం సుభాష్, ఉప సర్పంచ్ పాల్వ మారుతీ, బాబారావ్ పటేల్, పాల్వే శివాజీ, ముండే రాంకిషన్, పాల్వే సంతోష్, దహిపాలే పరమేశ్వర్, బజార్ హత్నూర్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ నూర్ సింగ్, పలువురు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# కొంటె చూపులతో కవ్విస్తున్న క్యూట్ బ్యూటీ



తెలుగు సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన అత్యంత తక్కువ సమయంలో మంచి గుర్తింపును సంపాదించుకున్న వారిలో శ్రీలీల ఒకరు. పెళ్లి సందD అనే చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అయిన ఈ ముద్దుగుమ్మ మొదటి సినిమాతోనే మంచి ప్రశంసలను అందుకుంది. ఆ తర్వాత ఈమె నటించిన ధమాకా సూపర్ హిట్ అయ్యి ఏకంగా 100 కోట్లకు పైగా కలెక్షన్లను వసూలు చేసింది.

ఇందులోని ఈమె డాన్స్ కి, అందానికి ప్రేక్షకులు ఫిదా అయ్యారు. దానితో ఈ ముద్దుగుమ్మకు తెలుగులో స్టార్ హీరోల సినిమాల్లో వరుస పెట్టి ఆఫర్లు వచ్చాయి. ఈమెకు ఆఫర్లు క్యూ కట్టాయి కానీ విజయాలు మాత్రం దక్కలేదు. ప్రస్తుతం ఈమె తెలుగుతో పాటు తమిళ సినిమాల్లో కూడా చాలా చురుగ్గా నటిస్తోంది. కొంతకాలం క్రితం ఈమె నటించిన పరాశక్తి అనే తమిళ సినిమా విడుదల అయింది.

ఈ చిత్రం బాక్స్ ఆఫీస్ దగ్గర ప్రేక్షకులను అలరించడంలో విఫలమైంది. సినిమాల్లో తన అందాలను భారీగా ఆరబోస్తూ కుర్రకారు ప్రేక్షకులకు గుబులు రేపుతున్న ఈ చిన్నది సోషల్ మీడియాలో కూడా అదే స్థాయిలో అందాలను ఒలకబోస్తోంది. ఇప్పటికి అనేకసార్లు ఈమెకు సంబంధించిన ఫోటోలు చాలా పెద్ద ఎత్తున వైరల్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి.


తాజాగా శ్రీలీల తన 'ఇన్ స్టా'లో కొన్ని ఫోటోలను పోస్ట్ చేసింది. అందులో ఈ బ్యూటీ లైట్ పర్పుల్ కలర్ శారీని కట్టుకొని, అందుకు తగిన స్లీవ్ లెస్ బ్లౌజ్ ధరించి, కురులను విరబోసుకొని క్యూట్ స్మైల్ తో కవ్వించే విధంగా ఉన్న ఫోటోలను పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.

# చైతూ కోసం నాగవంశీ అన్ని కోట్లు రిస్క్



చాలా సంవత్సరాలు వెనక్కు వెళ్లినట్లయితే నిర్మాతలు ఎక్కువ శాతం డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి ఎంట్రీ ఇచ్చేవారు కాదు. పెద్ద నిర్మాతలకు కొంతమంది డిస్ట్రిబ్యూటర్స్ ఉండేవారు, వారు ఏదైనా సినిమాను నిర్మిస్తే ఎక్కువ, తక్కువ తేడాలతో ఒక ఏరియాకు ఒకరిని ఎంచుకొని వారికి హక్కులను ఇచ్చేవారు, ప్రస్తుతం పరిస్థితులు మారాయి. నిర్మాతలుగా ఎంట్రీ ఇచ్చి మంచి స్థాయికి చేరుకున్న వారు ఎంతోమంది డిస్ట్రిబ్యూషన్ వైపు కూడా అడుగులు వేస్తున్నారు. అందులో నాగ వంశీ ఒకరు. ఈయన సీతార ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై ఎన్నో సినిమాలను నిర్మించాడు. ప్రస్తుతం ఎన్నో సినిమాలను నిర్మిస్తున్నాడు. ఈయన కేవలం సినిమాలను ప్రొడ్యూస్ చేయడం మాత్రమే కాకుండా ఇతర నిర్మాతలు నిర్మించిన సినిమాలను డిస్ట్రిబ్యూట్ కూడా చేస్తున్నాడు. కొంతకాలం క్రితం ఈ నిర్మాత 'దేవర పార్ట్ 1', 'వార్ 2' లను డిస్ట్రిబ్యూట్ చేశాడు. ఇందులో దేవర ద్వారా ఈయనకు లాభాలు వచ్చిన వార్ 2 ద్వారా మాత్రం లాభాలు రాలేదని స్వయంగా ఆయనే చెప్పుకొచ్చాడు. తాజాగా ఈ నిర్మాత మరో సినిమా డిస్ట్రిబ్యూషన్ హక్కులను భారీ ధరకు దక్కించుకున్నట్లు ఓ వార్త చక్కర్లు కొడుతుంది. నాగ వంశీ, నాగ చైతన్య హీరోగా కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న వృషకర్మ యొక్క ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మరియు కర్ణాటక హక్కులను 45 కోట్ల భారీ ధరకు దక్కించుకున్నట్లు సోషల్ మీడియాలో ఓ వార్త చక్కర్లు కొడుతుంది. దానితో నాగ వంశీ పెద్ద రిస్క్ చేస్తున్నాడు, టాక్ ఏ మాత్రం తేడా కొట్టిన ఆయనకు నష్టాలు వస్తాయి అని కొంతమంది అభిప్రాయపడుతుంటే, మరి కొంతమంది మాత్రం ఆయన సినిమా గురించి అన్నీ తెలుసుకునే అంత ధరకు కొనుగోలు చేసి ఉంటాడు. కచ్చితంగా ఆ మూవీతో పెద్ద మొత్తంలో లాభాలను అందుకుంటాడు అని అంచనా వేస్తున్నారు.

# రెడ్ డ్రెస్‌లో సెగల పుట్టిస్తున్న నోరా..




కన్నడ యాక్షన్ స్టార్ ధ్రువ సర్జా హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'కెడీ ది డెవిల్' నుంచి క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. దర్శకుడు ప్రేమ్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉండగా, తాజాగా చిత్రబృందం ఒక అదిరిపోయే స్పెషల్ సాంగ్ అప్‌డేట్‌తో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఈ చిత్రంలో బాలీవుడ్ సెన్సేషన్ నోరా ఫతేహి ఒక ప్రత్యేక గీతంలో మెరవబోతోంది. దీనికి సంబంధించి విడుదల చేసిన పోస్టర్‌లో నోరా ఎరుపు రంగు దుస్తుల్లో 'మిర్చి'లాంటి ఘాటు అందాలతో కనిపిస్తూ కుర్రకారుకు చెమటలు పట్టిస్తోంది. ఈ ప్రత్యేక గీతం 'సర్సే.. నిన్నా సిరాగే సర్సే' మార్చి 14వ తేదీ సాయంత్రం 5:05 గంటలకు విడుదల కానుంది. నోరా డ్యాన్స్, ధ్రువ సర్జా మాస్ స్టెప్పులతో ఈ పాట థియేటర్లలో రచ్చ చేయడం ఖాయంగా కనిపిస్తోంది.

ఈ సినిమా బిజినెస్ పరంగా కూడా సంచలనం సృష్టిస్తోంది. తాజాగా తమిళనాడు థియేట్రికల్ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ, ఉదయనిధి స్టాలిన్‌కు చెందిన రెడ్ జెయింట్ మూవీస్ భారీ ధరకు సొంతం చేసుకుంది. ఇది సినిమా రేంజ్‌ను మరింత పెంచింది. కెవిఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఏకకాలంలో విడుదల కానుంది. ఈ సినిమాలో రిష్మా నానయ్య హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు సంజయ్ దత్, సీనియర్ నటి శిల్పాశెట్టి, కన్నడ క్రేజీ స్టార్ రవిచంద్రన్ కీలక పాత్రల్లో కనిపిస్తున్నారు. 1970ల కాలం నాటి బెంగళూరు గ్యాంగ్‌స్టర్ కథాంశంతో వస్తున్న ఈ చిత్రం యాక్షన్ ప్రియులకు కనువిందు చేయనుంది.

# మెగాస్టార్ చిరంజీవి క్రేజీ ప్లాన్.. సుకుమార్ శిష్యుడితో మెగా సినిమా!

మెగాస్టార్ చిరంజీవి తన తదుపరి సినిమాల విషయంలో రూట్ మార్చారు. వరుసగా యువ దర్శకులకు, ముఖ్యంగా లెక్కల మాస్టర్ సుకుమార్ శిష్యులకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఫ్యాన్స్‌లో భారీ అంచనాలను రేకెత్తిస్తున్నారు. ఇప్పటికే పలు చిత్రాలతో బిజీగా ఉన్న బాస్, తాజాగా సుకుమార్ శిష్యుడైన దర్శకుడు శ్రీనివాస్ (శ్రీను) చెప్పిన కథకు ఫిదా అయినట్లు సమాచారం. ఈ చిత్రం పూర్తి స్థాయి గ్రామీణ నేపథ్యంతో సాగే బలమైన కథాంశం అని సినీ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తుంది. సుకుమార్ స్కూల్ నుంచి వచ్చే దర్శకులు సహజత్వానికి దగ్గరగా, రూటెడ్ ఎలిమెంట్స్‌తో సినిమాలు తీస్తారనే పేరుంది. ఇప్పుడు శ్రీనివాస్ కూడా చిరంజీవి కోసం అటువంటి ఒక పవర్‌ఫుల్ విలేజ్ స్టోరీని సిద్ధం చేశారని, దానికి మెగాస్టార్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది.

చిరంజీవి ప్రస్తుతం సుకుమార్ శిష్యులతో వరుసగా సినిమాలు లాక్ చేయడం విశేషం. ఇప్పటికే 'దసరా' ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో చిరు హీరోగా ఒక భారీ ప్రాజెక్ట్ ఖరారైంది. ఇప్పుడు తాజాగా శ్రీనివాస్ (శ్రీను) తో మరో సినిమా ఫిక్స్ అయ్యింది. సుకుమార్ శిష్యులు ప్రస్తుతం టాలీవుడ్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నారు. వారి మేకింగ్ స్టైల్ మెగాస్టార్ ఇమేజ్‌కు తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు. గత కొంతకాలంగా చిరంజీవి తన పంథా మార్చుకున్నారు. కేవలం సీనియర్ డైరెక్టర్లకే కాకుండా, కొత్త తరం ఆలోచనలకు తగ్గట్టుగా యంగ్ డైరెక్టర్లకు అవకాశం ఇస్తున్నారు. బాబీ కొల్లితో చేస్తున్న సినిమా తర్వాత, ఈ ఇద్దరు సుకుమార్ శిష్యుల సినిమాలు పట్టాలెక్కనున్నాయి. ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. శ్రీకాంత్ ఓదెల, శ్రీనివాస్ వంటి టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్లతో మెగాస్టార్ చేస్తున్న ఈ ప్రయోగం టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.



# ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో నాకు సంబంధం లేదు



ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనురాగ్ కశ్యప్ పేరు ఉందని వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై ఆయన మరోసారి స్పందించారు. తనకు ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో సంబంధం లేదని చెప్పారు.

అసలు ఆ ఈమెయిల్స్ గురించి తనకు తెలియదని, తాను ఎప్పుడూ బీజింగ్‌కు వెళ్లలేదని కశ్యప్ స్పష్టంచేశారు. ఆ పత్రాల్లో పేర్కొన్న వివరాలకు తనకు ఎలాంటి సంబంధం లేదని, అసలు తన పేరు అందులోకి ఎలా వచ్చిందో కూడా తనకు తెలియదన్నారు. తాను చైనా వెళ్లానని.. కానీ, అది 2014కు ముందు అని తెలిపారు. అది కూడా సినిమా లొకేషన్‌ల కోసం వెళ్లినట్లు చెప్పారు. ఆ సమయంలో తాను ముంబయిలో తన పనిలో నిమగ్నమై ఉన్నట్లు చెప్పారు. అనవసర వివాదంలో తన పేరును లాగినట్లు తెలిపారు.

ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఓ ఈవెంట్ కోసం అనురాగ్ 2017లో బీజింగ్ వెళ్లారంటూ రూమర్స్ వచ్చాయి. దీనిపై ఆయన గతంలోనూ స్పందించారు. తన సినిమాల కన్నా తన పేరుతో కూడిన ప్రచారంపై ఆసక్తి చూపించడాన్ని తప్పుబట్టారు.

# డబ్బింగ్ చెబుతూ పవన్ కంటతడి పెట్టారు



టాలెంటెడ్ డైరెక్టర్ హరీష్ శంకర్ తాజాగా పవన్ కళ్యాణ్ హీరోగా ఉస్తాద్ భగత్ సింగ్ అనే చిత్రాన్ని రూపొందించాడు. ఈ సినిమాను మార్చి 19వ తేదీన విడుదల చేయనున్నారు. ఈ సినిమా విడుదల తేదీ దగ్గర పడడంతో హరీష్ శంకర్ వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటూ ఈ సినిమాకు సంబంధించిన అనేక ఆసక్తికరమైన విషయాలను తెలియజేస్తున్నాడు. తాజాగా హరీష్ శంకర్ ఈ సినిమా డబ్బింగ్ సమయంలో జరిగిన ఒక ఇన్సిడెంట్ గురించి తెలియజేశాడు.

హరీష్ శంకర్ మాట్లాడుతూ... పవన్ కళ్యాణ్ గారు ఈ సినిమా డబ్బింగ్ చెప్పే సమయంలో ఓ సన్నివేశం వచ్చేసరికి కంటతడి పెట్టుకున్నారు, కంటతడి పెట్టుకోవడం మాత్రమే కాకుండా ఓ రెండు నిమిషాలు ఆగి నీళ్లు తాగి ఆ తర్వాత డబ్బింగ్ చెప్పడం మొదలుపెట్టారు. అంతలా ఆయన ఆ సీన్లో ఇన్వాల్వ్ అయ్యారు అని ఈ దర్శకుడు చెప్పుకొచ్చాడు. కొంతకాలం క్రితం విడుదల అయ్యి భారీ విజయాన్ని అందుకున్న ధురంధర్ సినిమా సీక్వెల్ 'ధురంధర్ 2'ను కూడా మార్చి 19న విడుదల చేయనున్నారు. దానితో చాలామంది ఉస్తాద్ భగత్ సింగ్ మూవీకి ఇది గట్టి పోటీ అని భావిస్తున్నారు.

తాజా ఇంటర్వ్యూలో భాగంగా 'హరీష్ శంకర్'కి 'ధురంధర్ 2'తో పాటు మీ సినిమాను విడుదల చేస్తున్నారు, అది రిస్క్ అని మీరు అనుకోవట్లేదా అనే ప్రశ్న ఎదురయింది. దానికి ఆయన సమాధానం చెబుతూ... దురంధర్ 1 చాలా గొప్ప విజయం సాధించింది. దురంధర్ 2 పై ప్రేక్షకుల్లో అంచనాలు భారీగా ఉన్నాయి. కానీ మాది ఫ్యాన్ ఇండియా సినిమా కాదు, తెలుగు రాష్ట్రాల్లో మా సినిమాకు మంచి క్రేజ్ ఉంది. అలాగే 'ధురంధర్'కు మా సినిమాకు అనేక వ్యత్యాసాలు ఉన్నాయి. కొన్ని సమయాల్లో రెండు, మూడు సినిమాలు విడుదల అయినా కూడా పెద్దగా ప్రాబ్లం ఉండదు, అలాంటి తేదీనే మార్చి 19 అనుకుంటున్నాం. అందుకే సమిష్టిగా అందరం కూర్చుని మాట్లాడుకొని ఈ తేదీన విడుదల చేయడానికి నిర్ణయించుకున్నాము అని ఆయన సమాధానం ఇచ్చాడు.

# 'ధురంధర్ 2' చూసి సౌత్ ఇండస్ట్రీ ఎంతో నేర్చుకోవాలి..





సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తన హాట్ కామెంట్స్‌తో ఇండస్ట్రీలో చర్చకు తెరలేపారు. రణవీర్ సింగ్ హీరోగా రాబోతున్న 'ధురంధర్ 2: ద రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సునామీ సృష్టించడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఈ సినిమా గనుక భారీ వసూళ్లు సాధిస్తే, ప్రస్తుతం నడుస్తున్న సౌత్ సినిమాల హవాకు బ్రేక్ పడుతుందని వర్మ అభిప్రాయపడ్డారు. ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వర్మ.. "ఒకవేళ ధురంధర్ 2 ప్రపంచవ్యాప్తంగా రూ. 1,500 2,000 కోట్ల వసూళ్లను సాధిస్తే, సౌత్ సినిమాలన్నీ తోక ముడవాల్సిందే. దాన్ని చూసి చాలా నేర్చుకోవాల్సిందే లేకుంటే వసూళ్లు కష్టతరం అవుతుంది" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. సౌత్ యాక్షన్ సినిమాలు ఇప్పటికీ పాత తరహా కథనాలతోనే సాగుతున్నాయని, కానీ 'ధురంధర్' సిరీస్ బాలీవుడ్ యాక్షన్‌ను సరికొత్త స్థాయికి తీసుకెళ్లిందని ఆయన కొనియాడారు.

గతేడాది డిసెంబర్‌లో విడుదలైన మొదటి భాగం రూ. 1,300 కోట్లు వసూలు చేయడంతో, సీక్వెల్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆదిత్య ధర్ దర్శకత్వంలో వస్తున్న ఈ స్పై థ్రిల్లర్‌లో రణవీర్ సింగ్ 'హంజా' (జస్కీరత్) అనే ఇండియన్ ఏజెంట్ పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా గురించి వర్మ మాట్లాడుతూ.. "గాలిలో ఎగురుతూ తన్నే విన్యాసాలు కాకుండా, ఇందులో యాక్షన్ చాలా సహజంగా ఉంటుంది. కథలో ప్రేక్షకులు ఇప్పటికే ఎమోషనల్‌గా కనెక్ట్ అయి ఉన్నారు. బాహుబలి తరహాలో రెండు భాగాలను ఒకేసారి షూట్ చేయడం వల్ల కథా ప్రవాహం చాలా బాగుంటుంది" అని అన్నారు. ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి. కొందరు నెటిజన్లు ఆయనపై విమర్శలు చేస్తున్నారు.

నిజానికి ఈ సినిమా యష్ నటిస్తున్న 'టాక్సిక్'తో తలపడాల్సి ఉంది. కానీ 'టాక్సిక్' జూన్‌కు వాయిదా పడటంతో ఆ ముప్పు తప్పింది. అయితే, ఇప్పుడు 'ధురంధర్ 2' నేరుగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్'తో బాక్సాఫీస్ వద్ద పోటీ పడనుంది. మార్చి చివరి వారంలో ఈ రెండు భారీ సినిమాలు ఒకేసారి థియేటర్లలోకి రాబోతుండటంతో సినీ ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో ఆర్. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి స్టార్ కాస్ట్ ఉండటం సినిమాపై మరింత క్రేజ్ పెంచుతోంది.